



# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక: 66 | ఎడిటర్: మేనం శ్యామ్ | గురువారం 24-09-2026 | పేజీలు: 10


## సిరా చుక్క

మనిషి రూపు మిగిలింది...
మనసు మాత్రం మృగమైపోయింది!
తోటి మనిషి రక్తం చిందిస్తున్నా,
ఫోన్ కెమెరాలకు వినోదమైన వేళ...
కన్నీటి విలువ తెలియని కఠినత్వంలో
మానవత్వం సమాధి అయ్యింది.
స్వార్థం అనే చితిపై
దయా జాలి బూడిదయ్యాయి.
తోటివాని ఆక్రందన వినపడని చెవులతో,
కష్టాల్లో ఉన్న చేయిని
అందుకోలేని చేతులతో...
మనం మనుషులమని చెప్పుకోవడానికి
సిగ్గుపడాల్సిన సమయమిది!
గుండెల్లో ఈతరం నింపిందేమిటి?
రాయిలా మారిన మనస్సా...లేక
చల్లబడిపోయిన నెత్తురా?
విలువలు చచ్చిన చోట
మానవత్వం ఓ శవం...
దానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నది
సమాజమనే స్వార్థ ప్రపంచం!
సమాజం లో మార్పు రావాలి..
అప్పుడే సమాజం బాగుపడుతుంది.....,


వారేవేణుగోపాల్....
పాపన్నపేట....
మెదక్. జర్నలిస్ట్



# ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026.!

- భారీ పెట్టుబడులే లక్ష్యంగా సర్కార్ కసరత్తు
- డిసెంబర్ 7 నుంచి 9 వరకు మూడు రోజుల పాటు సమ్మిట్
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- దేశ, విదేశాల్లో రోడ్‌షోలు నిర్వహించాలని నిర్ణయం
- సమ్మిట్ ఏర్పాట్లకు దాదాపు 10 ప్రత్యేక అధికారుల కమిటీలు
- ప్రత్యేక వార్‌రూమ్ ఏర్పాటు చేసి రోజువారీ పర్యవేక్షణ






**ప్రజా వాయిస్, హైదరాబాద్:** తెలంగాణలో పెట్టుబడులను భారీగా ఆకర్షించే లక్ష్యంతో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026 ఏర్పాట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది. డిసెంబర్ 7 నుంచి 9 వరకు జరగనున్న సమ్మిట్ ఏర్పాట్లపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ ఉపసంఘం సమావేశమైంది. తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యానికి అనుగుణంగా పెట్టుబడులు ఆకర్షించాలని భట్టి అధికారులకు సూచించారు.

**దేశ, విదేశాల్లో రోడ్‌షోలు**

పెట్టుబడులకు అవకాశాలున్న దేశాలు, నగరాలు, రంగాలపై ప్రత్యేకంగా అధ్యయనం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. దేశ, విదేశాల్లో రోడ్‌షోలు నిర్వహించి తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించాలని నిర్ణయించారు.

**10 ప్రత్యేక కమిటీల ఏర్పాటు**

సమ్మిట్ ఏర్పాట్ల పర్యవేక్షణకు దాదాపు 10 ప్రత్యేక అధికారుల కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. సీనియర్ అధికారులు, మంత్రులకు వివిధ బాధ్యతలు అప్పగించడంతో పాటు ప్రత్యేక వార్‌రూమ్ ఏర్పాటు చేసి ప్రతిరోజూ ఏర్పాట్ల పురోగతిని పర్యవేక్షించనున్నారు.

**అంతర్జాతీయ మీడియాకు విస్తృత ప్రచారం**

ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, సామాజిక మాధ్యమాల ద్వారా సమ్మిట్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని నిర్ణయించారు. అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని భట్టి సూచించారు. గతంలో కుదిరిన అవగాహన ఒప్పందాల అమలు పురోగతిని కూడా సమీక్షించాలని ఆదేశించారు.

**ప్రతినిధుల సంఖ్యను బట్టి ప్రాంగణాల పెంపు**

సమ్మిట్‌కు వచ్చే ప్రతినిధుల స్పందనను బట్టి సభా ప్రాంగణాల సంఖ్యను 4 నుంచి 6 లేదా 8కి పెంచే అంశాన్ని పరిశీలించనున్నారు. కేవలం మూడు రోజుల కార్యక్రమంగా కాకుండా తెలంగాణకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చే వేదికగా సమ్మిట్‌ను తీర్చిదిద్దాలని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# మీ సేవ కేంద్రాల్లో సర్వర్ మొరాయింపు.! విద్యార్థులకు తిప్పలు

- ఉదయం నుంచి రాత్రి వరకు అందుబాటులోకి రాని సర్వర్
- గంటల తరబడి కేంద్రాల వద్ద వేచి చూస్తున్న పౌరులు, విద్యార్థులు
- ఉపకార వేతన దరఖాస్తులకు ఈ నెల 25 వరకు గడువు
- ముందుగా మీ సేవ కేంద్రాల్లో జీవమితి పూర్తి చేసుకోవాల్సిన పరిస్థితి
- వారం రోజులుగా సమస్య ఉన్నా పట్టించుకోవడం లేదంటున్న విద్యార్థులు




**ప్రజా వాయిస్, హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్‌లోని మీ సేవ కేంద్రాల్లో సర్వర్ మొరాయిస్తుండటంతో పౌరులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు సర్వర్ అందుబాటులోకి రాకపోవడంతో వివిధ పనుల కోసం కేంద్రాలకు వచ్చిన వారు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. సర్వర్ ఎప్పుడు పనిచేస్తుందో తెలియక చివరకు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

**ఉపకార వేతన దరఖాస్తులకు గడువు దగ్గరపడటంతో..**

2026–27 విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరిన విద్యార్థులు ప్రభుత్వం అందించే

మిగతా 2లో

## జూరాల నుంచి సాగునీటి విడుదల.!

- మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాలతో చర్యలు
- కుడి కాలువకు 350 క్యూసెక్కుల నీటి విడుదల
- ఎడమ కాలువకు 750 క్యూసెక్కుల నీటి విడుదల
- ఆయకట్టు రైతుల సాగునీటి అవసరాల మేరకు నిర్ణయం
- కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో తెలంగాణ మంత్రుల భేటీ
- జూరాలకు కృష్ణా జలాల విడుదలపై సమావేశంలో చర్చ

2లో



# కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది.!

- కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు
- రాష్ట్రంలో విద్యుత్ కోతలు పెరిగాయంటూ కేటీఆర్ విమర్శలు
- పలు ప్రాంతాల్లో ఆరు గంటలకు మించి సరఫరా ఉండటం లేదని ఆరోపణ
- జెన్‌కోలో బొగ్గు నిల్వలు లేవంటూ వ్యాఖ్యలు
- సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆరోపణ
- రైతులకు 24 గంటల విద్యుత్ ఇవ్వాలని డిమాండ్



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** తెలంగాణలో విద్యుత్ సరఫరా పరిస్థితిపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విద్యుత్ ఉండదని గతంలో తాము చెప్పామని, ఇప్పుడు అదే జరుగుతోందని వ్యాఖ్యానించారు. బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. "కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది" అంటూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కేటీఆర్ వ్యాఖ్యలను పలు వార్తా సంస్థలు కూడా నివేదించాయి.

**ఆరు గంటలకే విద్యుత్ సరఫరా అంటూ ఆరోపణ**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ వ్యవస్థ మెరుగ్గా నడిచిందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన

మిగతా 2లో

## విద్యార్థినితో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన.!

- పరిగిలో కలకలం
- ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిపై తీవ్ర ఆరోపణలు
- సంరక్షుల ఫిర్యాదుతో ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- బాలిక, సంరక్షుల నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు
- గతంలోనూ విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించాడని ఆరోపణలు
- పాఠశాలల్లో చిన్నారుల భద్రతపై తల్లిదండ్రుల్లో ఆందోళన



# తెలంగాణ ఉద్యోగులకు రెండు డీఏలు.!

- 3.46, 2.74 శాతాలకు ప్రభుత్వం అంగీకారం
- రెండు కరువు భత్యాలకు ప్రభుత్వం సానుకూలత తెలిపిందన్న ఉద్యోగ సంఘాలు
- 3.46 శాతంతో ఒక డీఏ ఇప్పటికే ప్రకటించిన ప్రభుత్వం
- 2.74 శాతంతో మరో డీఏ ఇచ్చేందుకు అంగీకారం
- మూడు, నాలుగు నెలల్లో మూడో డీఏ ఇస్తామని హామీ
- ఈ నెలాఖరులోగా పీఆర్సీ నివేదిక వచ్చే అవకాశం



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు రెండు కరువు భత్యాలు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వెల్లడించారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రధానంగా వేతన సవరణ సంఘం నివేదిక పురోగతిపై చర్చించినట్లు తెలిపారు.

**రెండు డీఏలకు సానుకూలత**

ఉద్యోగ సంఘాలు మూడు డీఏలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినట్లు వెల్లడించాయి. అయితే ప్రస్తుతం రెండు డీఏలు ఇచ్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. 3.46 శాతంతో ఒక డీఏను ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని, మరో 2.74 శాతం డీఏను ఇచ్చేందుకు అంగీకరించిందని ఉద్యోగ సంఘాల నేతలు పేర్కొన్నారు.

**మూడో డీఏపై హామీ**

మూడో డీఏను మూడు నుంచి నాలుగు నెలల్లో ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని ప్రభుత్వం స్పష్టం చేసినట్లు చెప్పారు.

**ఈ నెలాఖరులో పీఆర్సీ నివేదిక**

ఈ నెలాఖరు నాటికి వేతన సవరణ సంఘం నివేదిక వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపినట్లు ఉద్యోగ సంఘాల నేతలు వెల్లడించారు. నివేదిక వచ్చిన వెంటనే తదుపరి చర్యలు చేపడతామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు.


**పాత పింఛను విధానంపై కమిటీ**

కొత్త పింఛను విధానాన్ని రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేసే అంశంపై అధ్యయనం చేసేందుకు ఉద్యోగ సంఘాల నేతలు, అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం తెలిపినట్లు వెల్లడించారు. ఈ కమిటీ వివిధ రాష్ట్రాల్లో పర్యటించి అధ్యయనం చేసి నివేదిక ఇవ్వనుందని ఉద్యోగ సంఘాల నేతలు వివరించారు.

## క్యాబ్ ఎక్కుతున్న మహిళకు బలవంతంగా ముద్దు.!

- సెక్యూరిటీగార్డు అరెస్ట్
- గచ్చిబౌలి ఇందిరానగర్‌లో ఘటన
- క్యాబ్ ఎక్కేందుకు వెళ్తున్న మహిళను పక్కకు లాగిన నిందితుడు
- బలవంతంగా ముద్దు పెట్టడంతో షాక్‌కు గురైన బాధితురాలు
- అరుపులు విని అక్కడి నుంచి పరారైన సెక్యూరిటీగార్డు
- సీసీటీవీ ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసిన పోలీసులు

2లో



# తెలంగాణకు కృష్ణా జలాలు.!

- డీకే శివకుమార్‌కు సీఎం రేవంత్ ధన్యవాదాలు
- కృష్ణా జలాలు విడుదల చేయాలని రేవంత్ విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన కర్ణాటక సీఎం డీకే శివకుమార్
- కర్ణాటక సీఎంకు తెలంగాణ ప్రజల తరపున రేవంత్ కృతజ్ఞతలు
- రెండు రాష్ట్రాల స్నేహభావానికి ఇదొక గొప్ప ఉదాహరణ
- కృష్ణా జలాల విడుదల నిర్ణయాన్ని ప్రశంసించిన సీఎం



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** తెలంగాణకు కృష్ణా జలాలను విడుదల చేయాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ విజ్ఞప్తిపై డీకే శివకుమార్ సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి బుధవారం స్పందిస్తూ కర్ణాటక సీఎంకు తెలంగాణ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

**విజ్ఞప్తిని అంగీకరించినందుకు ధన్య వాదాలు**

తెలంగాణకు కృష్ణా జలాలను విడుదల చేయాలన్న తన విజ్ఞప్తిని అంగీకరించినందుకు డీకే శివకుమార్‌కు సీఎం రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రెండు రాష్ట్రాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా ఉందని పేర్కొన్నారు.

**రెండు రాష్ట్రాల స్నేహభావానికి నిదర్శనం**


కృష్ణా జలాల విడుదల నిర్ణయం రెండు రాష్ట్రాల మధ్య ఉన్న స్నేహభావానికి గొప్ప ఉదాహరణ అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కర్ణాటక, తెలంగాణ ప్రజల మధ్య ఉన్న సోదర భావానికి ఇది నిదర్శనమని తెలిపారు.

**డీకే శివకుమార్‌పై ప్రశంసలు**

దేశ ప్రజల మధ్య ప్రేమ, సోదరభావాన్ని చాటేలా కృష్ణా జలాల విడుదలపై నిర్ణయం తీసుకున్నందుకు కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌ను రేవంత్ రెడ్డి ప్రశంసించారు. ఈ మేరకు తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు.

# భూముల రీసర్వేకు గ్రామస్థుల అడ్డంకి.!

- 113 ఎకరాల భూమిపై వివాదం
- ఎర్రవల్లిలో రెవెన్యూ అధికారుల సర్వేను అడ్డుకున్న వెంకటాపూర్ గ్రామస్థులు
- తమ గ్రామ భూమిని ఎర్రవల్లి రికార్డుల్లో నమోదు చేశారని ఆరోపణ
- సర్వే నంబర్ 325లోని 113 ఎకరాలపై వివాదం
- ముందుగా క్షేత్రస్థాయిలో హద్దులు నిర్ధారించాలని డిమాండ్
- తహశీల్దార్, అదనపు కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేత



**ప్రజా వాయిస్, సిద్దిపేట:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వేకు సిద్దిపేట జిల్లా మర్కూక్ మండల పరిధిలోని ఎర్రవల్లిలో గ్రామస్థులు అడ్డుతగిలారు. తమ గ్రామానికి సంబంధించిన 113 ఎకరాల భూమిని ఎర్రవల్లి గ్రామ రికార్డుల్లో నమోదు చేశారని వెంకటాపూర్ గ్రామస్థులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఎర్రవల్లిలో రెవెన్యూ అధికారులు చేపట్టిన భూముల సర్వేను వారు అడ్డుకున్నారు.

**113 ఎకరాలపై అభ్యంతరం**

సర్వే నంబర్ 325లోని తమ గ్రామానికి సంబంధించిన 113 ఎకరాల భూమిని ముందుగా క్షేత్రస్థాయిలో సర్వే చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. భూమికి సంబంధించిన హద్దులను స్పష్టంగా నిర్ధారించిన తర్వాతే ఇతర భూముల సర్వే చేపట్టాలని కోరారు.

**అధికారులకు వినతిపత్రాలు**

ఈ విషయమై వెంకటాపూర్ గ్రామస్థులు మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. అనంతరం బుధవారం మర్కూక్ తహశీల్దార్ సరితను కలిసి తమ అభ్యంతరాలను వివరించారు. తమ గ్రామానికి చెందిన భూమిని కాపాడాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

**కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లకు ఫిర్యాదు**

అనంతరం గ్రామస్థులు కలెక్టరేట్‌కు వెళ్లి అదనపు కలెక్టర్లను కలిశారు. సర్వే నంబర్ 325లోని 113 ఎకరాల భూమిపై తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని, క్షేత్రస్థాయిలో హద్దులను నిర్ధారించిన తర్వాతే రీసర్వే ప్రక్రియను కొనసాగించాలని కోరారు.

# విద్యార్థినితో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన.!

**ప్రజా వాయిస్, పరిగి:** పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడిపై తీవ్ర ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. పాఠశాలలో చదువుతున్న ఓ బాలికతో సదరు ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు రావడంతో స్థానికంగా కలకలం రేగింది. ఉపాధ్యాయుడి ప్రవర్తనతో ఇబ్బందికి గురైన బాలిక ఈ విషయాన్ని సంరక్షుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

**సంరక్షుల ఫిర్యాదుతో విచారణ**

బాలిక చెప్పిన విషయాలను తెలుసుకున్న సంరక్షులు పరిగి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు సదరు ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. బాలికతో పాటు ఆమె సంరక్షుల నుంచి వివరాలు సేకరిస్తూ ఘటనకు సంబంధించిన పూర్తి అంశాలపై ఆరా తీస్తున్నారు.

**గతంలోనూ అసభ్య ప్రవర్తన ఆరోపణలు**

సదరు ఉపాధ్యాయుడిపై గతంలోనూ విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయని సంరక్షులు చెబుతున్నట్లు సమాచారం. దీంతో ఈ వ్యవహారంపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**వరుస ఘటనలతో ఆందోళన**

పరిగి సర్కిల్ పరిధిలో విద్యార్థినులకు సంబంధించిన ఇలాంటి ఘటనలు వరుసగా వెలుగులోకి రావడం ఆందోళన కలిగిస్తోంది. దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో నిన్న ఓ ఘటన వెలుగులోకి రాగా.. తాజాగా పరిగి పరిధిలో మరో ఘటన బయటపడింది. పాఠశాలల్లో చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు, సంరక్షులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల దర్యాప్తు పూర్తయిన తర్వాత కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది.!

**మొదటి పేజీ తరువాయి**

తర్వాత రాష్ట్రంలో విద్యుత్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని పత్రికల్లో కథనాలు వస్తున్నాయని తెలిపారు. పలు సబ్‌స్టేషన్ల పరిధిలో రోజుకు ఆరు గంటలకు మించి విద్యుత్ సరఫరా ఉండటం లేదని ఆయన ఆరోపించారు.

**బొగ్గు కొరతపై ప్రశ్నలు**

విద్యుత్ కోతలకు ఎల్‌నినోను కారణంగా చూపుతున్నారని కేటీఆర్ విమర్శించారు. జెన్‌కోలో బొగ్గు నిల్వలు లేవని, సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆయన ఆరోపించారు. బొగ్గు అందుబాటులో ఉంటే థర్మల్ విద్యుత్ కేంద్రాలను ఎందుకు మూసివేస్తున్నారని ప్రశ్నించారు. సింగరేణి బొగ్గు సరఫరా, విద్యుత్ ఉత్పత్తిపై బీఆర్ఎస్ ఆరు బృందాలతో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనున్నట్లు కూడా తెలిపారు.

**24 గంటల విద్యుత్ ఇవ్వాలని డిమాండ్**

నీటి లభ్యత తగ్గడంతో జల విద్యుత్ ఉత్పత్తిపైనా



ప్రభావం పడుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అయితే విద్యుత్ కొరతకు ఎల్‌నినో ప్రభావం కూడా ఉందని తాజా విద్యుత్ రంగ నివేదికలు పేర్కొంటున్న నేపథ్యంలో, కేటీఆర్ ఆరోపణలు రాజకీయ విమర్శలుగా ఉన్నాయి.

# క్యాబ్ ఎక్కుతున్న మహిళకు బలవంతంగా ముద్దు.!

**ప్రజా వాయిస్, హైదరాబాద్:** హైదరాబాద్ గచ్చిబౌలిలో మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌తో సెక్యూరిటీగార్డు అసభ్యంగా ప్రవర్తించిన ఘటన కలకలం రేపింది. ఇందిరానగర్‌లో క్యాబ్ ఎక్కేందుకు వెళ్తున్న 24 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను అక్కడే ఉన్న సెక్యూరిటీగార్డు పక్కకు లాగి బలవంతంగా ముద్దు పెట్టినట్లు పోలీసులు తెలిపారు. ఒక్కసారిగా జరిగిన ఘటనతో బాధితురాలు తీవ్ర షాక్‌కు గురయ్యారు.

**బాధితురాలిని పక్కకు లాగి..**

క్యాబ్ ఎక్కేందుకు వెళ్తున్న సమయంలో సెక్యూరిటీగార్డు రాజ్‌కుమార్ ఆమెను పక్కకు లాగి బలవంతంగా ముద్దు పెట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో భయాందోళనకు గురైన బాధితురాలు వెంటనే బిగ్గరగా అరవడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు.

**పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు**

ఘటన అనంతరం బాధితురాలు గచ్చిబౌలి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటన జరిగిన ప్రాంతంలోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలించారు.

**సీసీటీవీ ఆధారంగా నిందితుడి గుర్తింపు**

సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు నిందితుడిని గుర్తించారు. జార్ఖండ్‌కు చెందిన సెక్యూరిటీగార్డు రాజ్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.



# డ్యాన్సర్స్ అసోసియేషన్ కార్యవర్గం రద్దు.!

- అక్టోబర్ 11న కొత్త కార్యవర్గానికి ఎన్నికలు
- సుమలత ఆధ్వర్యంలోని కార్యవర్గాన్ని రద్దు చేసిన ఫిల్మ్ ఫెడరేషన్
- సమావేశానికి హాజరైన 225 మంది డ్యాన్సర్లు
- సుమలతకు 11 మంది.. రఘు మాస్టర్‌కు 214 మంది మద్దతు
- డ్యాన్సర్ల అభిప్రాయాలను సేకరించిన ఫిల్మ్ ఫెడరేషన్
- అక్టోబర్ 11న నూతన కార్యవర్గం కోసం ఎన్నికలు

**ప్రజా వాయిస్, హైదరాబాద్:** తెలుగు ఫిల్మ్ ఫెడరేషన్ పరిధిలోని డ్యాన్సర్స్ అసోసియేషన్ విషయంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ భార్య సుమలత ఆధ్వర్యంలోని ప్రస్తుత కార్యవర్గాన్ని ఫిల్మ్ ఫెడరేషన్ రద్దు చేసింది. ఈ మేరకు బుధవారం నిర్వహించిన సమావేశంలో డ్యాన్సర్ల అభిప్రాయాలను సేకరించిన అనంతరం నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.



**225 మంది డ్యాన్సర్ల హాజరు**

ఫిల్మ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి మొత్తం 225 మంది డ్యాన్సర్లు హాజరయ్యారు. సుమలత, రఘు మాస్టర్‌తో పాటు పలువురు సభ్యులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరువర్గాలకు డ్యాన్సర్ల మద్దతుపై అభిప్రాయాలను సేకరించారు.

**సుమలతకు 11 మంది.. రఘుకు 214 మంది**

సేకరించిన అభిప్రాయాల్లో సుమలతకు 11 మంది డ్యాన్సర్లు మద్దతు తెలిపారు. రఘు మాస్టర్‌కు 214 మంది మద్దతు ప్రకటించారు. దీంతో సుమలత ఆధ్వర్యంలోని ప్రస్తుత కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు ఫిల్మ్ ఫెడరేషన్ ప్రకటించింది.

**అక్టోబర్ 11న ఎన్నికలు**

డ్యాన్సర్స్ అసోసియేషన్‌కు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు అక్టోబర్ 11న ఎన్నికలు నిర్వహించాలని ఫిల్మ్ ఫెడరేషన్ అధికారికంగా నిర్ణయించింది. ఈ ఎన్నికల ద్వారా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయనున్నారు.

# మీ సేవ కేంద్రాల్లో సర్వర్ మొరాయింపు.!

## విద్యార్థులకు తిప్పలు

**మొదటి పేజీ తరువాయి**

ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మీ సేవ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. అయితే దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 25 వరకు మాత్రమే గడువు ఉండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను వెంటబెట్టుకుని కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు.

**జీవమితి కోసం గంటల తరబడి నిరీక్షణ**

ఉపకార వేతనానికి దరఖాస్తు చేసుకోవాలంటే ముందుగా మీ సేవ కేంద్రాల్లో జీవమితి పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం ఆన్‌లైన్ కేంద్రాల్లో దరఖాస్తును అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అయితే వారం రోజులుగా మీ సేవ కేంద్రాల్లో జీవమితి సర్వర్ అందుబాటులోకి రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**సిబ్బంది సమాధానంపై విద్యార్థుల అసంతృప్తి**

ఉదయం నుంచి రాత్రి వరకు వేచి చూసినా సర్వర్ పనిచేయకపోవడంతో నిరుత్సాహంతో ఇంటికి తిరిగి వెళ్తున్నామని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. సమస్యపై మీ సేవ సిబ్బందిని ప్రశ్నిస్తే తమకు ఏమీ తెలియదని, పైస్థాయి నుంచి సమాచారం వస్తేనే తాము చర్యలు తీసుకుంటామని సమాధానం ఇస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపకార వేతన దరఖాస్తుల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

# జూరాల నుంచి సాగునీటి విడుదల.!



**ప్రజా వాయిస్, మహబూబ్‌నగర్:** తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాలతో జూరాల ప్రాజెక్టు నుంచి అధికారులు సాగునీటిని విడుదల చేశారు. ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా వెంటనే చర్యలు చేపట్టారు. జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేశారు.

**కుడి, ఎడమ కాలువలకు నీరు**

జూరాల కుడి కాలువ నుంచి 350 క్యూసెక్కులు, ఎడమ కాలువ నుంచి 750 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంత్రి వాకిటి శ్రీహరి ఈ ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

**కర్ణాటక సీఎంతో తెలంగాణ మంత్రుల భేటీ**

కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో తెలంగాణ మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు బుధవారం సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా జూరాలకు నీటి విడుదలతో పాటు పలు అంశాలపై చర్చించనున్నారు.

**కృష్ణా జలాల విడుదలకు వినతి**

ఉమ్మడి పాలమూరు జిల్లా రైతాంగం సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కృష్ణా జలాలను విడుదల చేయాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌ను తెలంగాణ మంత్రులు కోరారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఆయనకు వినతిపత్రం సమర్పించారు. తాజాగా జరగనున్న సమావేశంలోనూ జూరాలకు నీటి విడుదల అంశంపై చర్చించనున్నట్లు సమాచారం.




## పోలీస్ కొలువులే లక్ష్యంగా..

- ఏకేఆర్ స్టడీ సర్కిల్ లో 61 రోజుల పవర్ ఫుల్ బ్యాచ్
- వెల్లడించిన సంస్థ డైరెక్టర్ బి.వి. రమణ

**ప్రజావాయిస్/వికారాబాద్:** కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం వికారాబాద్‌లోని ఏకేఆర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 61 రోజుల "పవర్‌ఫుల్ బ్యాచ్" నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.వి. రమణ తెలిపారు.సెప్టెంబర్ 26 నుంచి నవంబర్ 25 వరకు కొనసాగనున్న ఈ ప్రత్యేక శిక్షణలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో అభ్యర్థులకు శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. కానిస్టేబుల్, ఎస్ఐ పరీక్షలకు అవసరమైన అంశాలపై ప్రత్యేక తరగతులతో పాటు పరీక్షా విధానానికి అనుగుణంగా అభ్యర్థులను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు.ఈ బ్యాచ్ సెప్టెంబర్ 26న శనివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని వెల్లడించారు. ప్రారంభ కార్యక్రమంలో నిజామాబాద్‌కు చెందిన సురేష్ సార్‌చే "తెలంగాణ ఉద్యమం" అంశంపై ఉచిత డెమో క్లాస్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బి.వి. రమణ కోరారు. మరిన్ని వివరాల కొరకు ఏకేఆర్ స్టడీ సర్కిల్, హనుమాన్ టెంపుల్ పక్కన, శివరాం నగర్ కాలనీ, ఫోన్: 94410 22571 నంబరుకు సంప్రదించాలన్నారు.

## రామారెడ్డి రైస్ మిల్లులో 275 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- గతంలో ఈ రైస్ మిల్లు డిఫాల్టర్ కింద కేసు నమోదు
- రైస్ మిల్లు మూసివేసాక యదేచ్ఛగా పిడిఎఫ్ బియ్యం దందా
- రైస్ మిల్లులో కొనసాగుతున్న అక్రమ బియ్యం వ్యాపారం
- కోట్ల రూపాయల సిఎంఆర్ బియ్యం బకాయిలు

**ప్రజా వాయిస్ కామారెడ్డి/**కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రంలోని భాగ్యలక్ష్మి రైస్ మిల్లులో అక్రమ 275 క్వింటాళ్ల రేషన్ షాపుల బియ్యం ఎన్ఫోర్స్మెంట్ అధికారులు పోలీసులు పట్టుకున్నారు. రైస్ మిల్లులో అక్రమంగా బియ్యం దందా సమాచారం మేరకు దాడులు చేయగలగా అక్రమ రేషన్ బియ్యం దందా బయటపడింది. పక్క సమాచారం మేరకు విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు, సివిల్ సప్లై అధికారులు, రామారెడ్డి పోలీసులు దాడులు చేయగా 400 బస్తాల పిడిఎస్ బియ్యం పట్టుకున్నారు. ఈ రైస్ మిల్లు గతంలో డిఫాల్టర్ గా కేసు నమోదయింది. రెవిన్యూ రికవరీ యాక్ట్ ద్వారా ప్రభుత్వానికి బకాయి ఉన్న కోట్ల రూపాయల సిఎంఆర్ బియ్యం రికవరీ చేస్తామని అధికారులు తెలిపారు. గతంలో ప్రభుత్వం నుండి సిఎంఆర్ బియ్యం తీసుకొని జమ చేయలేదని ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తెలిపారు. రైస్ మిల్లు మూసివేశాక పిడిఎఫ్ బియ్యం దందా అక్రమంగా చేపడుతున్నారని ఎన్ఫోర్స్మెంట్ అధికారులు వెల్లడించారు. రామారెడ్డి భాగ్య భాగ్యలక్ష్మి ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్ పై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పిడిఎస్ బియ్యం స్వాధీనం చేసుకొని రెవిన్యూ రికవరీ చట్టం కింద బకాయిలు రాబడతామని చట్టపరంగా తీసుకోవాల్సిన అన్ని చర్యలు తీసుకుంటామని ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్ఫోర్స్మెంట్ విజిలెన్స్ అధికారులు, సివిల్ సప్లై అధికారులు, రామారెడ్డి పోలీసులు రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ సింహగర్జనను విజయవంతం చేద్దాం.!

- బీసీ,ఏ సాధన కోసం పోరాటానికి సంపూర్ణ మద్దతు
- సెప్టెంబర్ 26న సిరిసిల్లలో భారీ కార్యక్రమం
- రాజకీయాలకు అతీతంగా ముదిరాజులు తరలిరావాలి
- రాష్ట్రవ్యాప్తంగా సంఘాలు, నాయకులు, యువతకు పిలుపు

**ప్రజా వాయిస్,హైదరాబాద్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా అంబేద్కర్ చౌరస్తాలో ఈ నెల 26న నిర్వహించనున్న ముదిరాజ్ సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. ముదిరాజుల హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముదిరాజులు పెద్ద సంఖ్యలో హాజరై తమ ఐక్యతను చాటాలని కోరారు.ముదిరాజుల



చిరకాల వాంఛ బీసీ–ఏ సాధనేనని దేవేందర్ ముదిరాజ్ పేర్కొన్నారు. బీసీ–ఏ సాధన కోసం చేపడుతున్న పోరాటానికి తమ సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు, ఇతర విభేదాలకు అతీతంగా ముదిరాజ్ సంఘాలు ఏకతాటిపైకి వచ్చి సింహగర్జనను విజయవంతం చేయాలని కోరారు.రాష్ట్రంలోని ముదిరాజ్ పెద్దలు, సంఘాల నాయకులు, యువత, ఉద్యోగులు, వృత్తి నిపుణులు పెద్ద సంఖ్యలో సిరిసిల్లకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ముదిరాజుల హక్కుల సాధన కోసం జరిగే ఈ కార్యక్రమం ఐక్యతకు ప్రతీకగా నిలిచేలా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని దేవేందర్ ముదిరాజ్ కోరారు.

# సూపరింటెండెంట్ కుర్చీ మారుతోంది.. కథ మారడం లేదు.!

- వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రిలో 'హాట్ సీట్'గా మారిన సూపరింటెండెంట్ చైర్
- బాధ్యతలు చేపట్టిన కొద్దికాలానికే రాజీనామా చేసిన డాక్టర్ వీరిన్
- మార్చిలో మృతదేహాన్ని ఎలుకలు కొరికిన ఘటన.. నిర్వహణపై హెచ్ ఆర్ సీ నోటీసులు
- తాత్కాలిక ఇన్ చార్జిగా డాక్టర్ భరత్ .. వరుస మార్పులపై ఆసుపత్రి వర్గాల్లో చర్చ




**ప్రజా వాయిస్,వర్ధన్నపేట:** ఒకటి కాదు.. రెండు కాదు.. వరుసగా సూపరింటెండెంట్లు మారుతున్నారంటే కారణమేంటి బాధ్యతలు చేపట్టిన కొద్దికాలానికే ఆ కుర్చీని వీడాల్సిన పరిస్థితి ఎందుకొస్తోంది వర్ధన్నపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఇప్పుడు ఇదే హాట్‌టాపిక్.సూపరింటెండెంట్ కుర్చీ 'హాట్‌సీట్'గా మారిందన్న చర్చ ఆసుపత్రి వర్గాల్లో జోరుగా సాగుతోంది.తాజాగా సూపరింటెండెంట్ డాక్టర్ వీరిన్ రాజీనామా చేసినట్లు విశ్వసనీయ సమాచారం. జూలై 24న ఆయన బాధ్యతలు స్వీకరించగా.. కొద్దికాలానికే పదవి నుంచి తప్పుకోవడం ఆసక్తికరంగా మారింది. ఆయన రాజీనామాకు దారితీసిన పూర్తి కారణాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది. ఇదే సమయంలో జిల్లా వైద్యాధికారి రామ్మూర్తి డాక్టర్ భరత్‌ను తాత్కాలిక ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా నియమించినట్లు తెలిసింది.

### ఆ ఘటనతో మొదలైన కలకలం

ఈ ఏడాది మార్చిలో వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఘటన అప్పట్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఫ్రీజర్ సౌకర్యం లేకపోవడంతో పోస్టుమార్టం గదిలో ఉంచిన మృతదేహాన్ని ఎలుకలు కొరికిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఆసుపత్రి నిర్వహణ, పోస్టుమార్టం గది పరిస్థితులపై పలు ప్రశ్నలు తలెత్తాయి.ఈ ఘటనపై మానవ హక్కుల కమిషన్ స్పందించి జిల్లా కలెక్టర్ సత్యశారదకు నోటీసులు జారీ చేసినట్లు స మాచార ం. పోస్టుమార్టం గది నిర్వహణలో నిర్లక్ష్యానికి స ంబ ంధించిన అంశాలపై వివరణ కోరినట్లు తెలిసింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే సూపరింటెండెంట్ డాక్టర్ వీరిన్ స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

### ఎవరు వచ్చినా.. కొద్దికాలమేనా.?

వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ బాధ్యతలు చేపట్టిన అధికారులు కొంతకాలానికే మారిపోతున్నారన్న చర్చ చాలా కాలంగా ఉందని స్థానిక వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో విజయలక్ష్మి, అనంతరం నరసింహస్వామి తదితరులు బాధ్యతలు నిర్వహించినట్లు తెలుస్తోంది. కొంతకాలం కొనసాగిన తర్వాత మార్పులు చోటుచేసుకోవడం ఆసుపత్రి పరిపాలనపై ఆసక్తిని పెంచుతోంది.

### అసలు కారణం ఏంటి.?

సూపరింటెండెంట్లు వరుసగా ఎందుకు మారుతున్నారు పరిపాలనా ఒత్తిళ్లా సిబ్బంది సమన్వయ సమస్యలా ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన అంశాలా లేక మరేదైనా కారణమా అన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే డాక్టర్ వీరిన్ రాజీనామాకు సంబంధించిన పూర్తి కారణాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.

### కొత్త ఇన్ చార్జిపై బాధ్యత

తాజాగా డాక్టర్ భరత్‌కు తాత్కాలిక సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించడంతో ఆయనపై ఆసుపత్రి పరిపాలనను గాడిలో పెట్టే బాధ్యత పడింది. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడం, సిబ్బంది సమన్వయం, ఆసుపత్రి నిర్వహణలో లోపాలను అధిగమించడం వంటి అంశాలపై కొత్త ఇన్‌చార్జి ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.సూపరింటెండెంట్ కుర్చీ మారుతోంది.. సమస్యలు మాత్రం అలాగే ఉన్నాయా అన్న ప్రశ్నకు ఇకనైనా అధికారుల చర్యలతో సమాధానం దొరకాల్సి ఉంది.

## సహారా లో కరిగిన కలలు

- మూడేళ్లుగా కన్నీళ్ళే
- పొదుపు సొమ్ము కోసం ఎదురుచూపులు
- సీఎం దృష్టికి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు బాధితుల వినతి
- కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని స్పీకర్ హామీ



**ప్రజావాయిస్/వికారాబాద్ బ్యూరో:** సహారా సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన ఖాతాదారులకు పెండింగ్‌లో ఉన్న చెల్లింపులను పూర్తిస్థాయిలో అందేలా సీఎం దృష్టికి తీసుకెళ్లి చెల్లింపులు జరిగేలా కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకోవాలని కోరుతూ బుధవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు సహారా కార్యకర్తలు,ఏజెంట్లు వినతిపత్రం సమర్పించారు. సహారా సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన అనేక మంది ఖాతాదారులు తమ డబ్బుల కోసం దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.వికారాబాద్ బ్రాంచ్, వికారాబాద్ ఎఫ్‌సీ, హైదరాబాద్ పరిధిలోని సహారా సంస్థల్లో ప్రజలు తమ పొదుపు సొమ్మును పెట్టుబడులుగా పెట్టారని తెలిపారు. సహారా సంస్థల్లోని ఎస్‌పీఎస్ డబ్బులను సహారా ఇండియా పరివార్‌లో పెట్టుబడిగా పెట్టిన ఖాతాదారులు ప్రస్తుతం చెల్లింపుల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వం సిఆర్సిఎస్ – సహారా రిఫండ్ పోర్టల్ ద్వారా అర్హత కలిగిన ఖాతాదారులకు రిఫండ్ ప్రక్రియను కొనసాగిస్తున్నప్పటికీ, కొంతమంది ఖాతాదారులకు ఇప్పటికీ వారి పెట్టుబడి మొత్తాలు పూర్తి స్థాయిలో అందడం లేదని తెలిపారు. ముఖ్యంగా మూడేళ్లకు పైగా తమ డబ్బుల కోసం ఎదురుచూస్తున్న ఖాతాదారుల సమస్య మరింత తీవ్రంగా ఉందని పేర్కొన్నారు.వృద్ధులు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఖాతాదారులు తమ పెట్టుబడి సొమ్ము కోసం ఎదురుచూస్తున్నారని, వారి సమస్యను సంబంధిత అధికారులు ప్రత్యేకంగా పరిశీలించాలని కోరారు. ఖాతాదారులతో పాటు సహారా సంస్థల ఏజెంట్లు కూడా చెల్లింపుల సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఖాతాదారుల సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పెండింగ్ చెల్లింపులు త్వరితగతిన అందేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని వినతి పత్రం ద్వారా స్పీకర్ ను కోరారు.ఇందుకు సానుకూలంగా స్పీకర్ స్పందిస్తూ సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.



## కేఎన్ఆర్ గ్రూప్ గణనాథుడికి ఘన వీడ్కోలు

- గణపయ్య వచ్చిండు.. 9రోజుల భక్తి పంచిండు
- సందడి చేసి సాగిపోయిండు!
- లడ్డు వేలంలో ఉత్సాహం
- లడ్డుకు లక్ష్మి కళ - రూ.51 వేలకు లడ్డును సొంతం చేసుకున్న దారెడ్డి నర్సింహారెడ్డి

**మొయినాబాద్ (ప్రజావాయిస్ ):** గణపయ్యొచ్చిండు.. తొమ్మిది రోజులు కొలువుదీరిండు.. పూజలందుకున్నాడు.. భక్తులంతా కలిసి పండుగ చేసుకున్నారు.. చివరికి మంగళవారం నిమజ్జనానికి బయలుదేరిండు. మొయినాబాద్‌లోని కేఎన్ఆర్ గ్రూప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. రోజూ పూజలు, ప్రసాదాలతో కార్యాలయ ప్రాంగణం భక్తి వాతావరణంతో కళకళలాడింది.ఉత్సవాల చివరి రోజున గణపయ్య ప్రసాదమైన లడ్డూ వేలం హుషారుగా సాగింది. లడ్డూ కోసం భక్తులు ఉత్సాహంగా వేలం పాటలో పాల్గొనగా.. చివరికి కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దారెడ్డి నర్సింహారెడ్డి రూ.51 వేలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. దీంతో అక్కడున్న భక్తులంతా ఆనందంతో చప్పట్లు కొట్టి అభినందించారు.అనంతరం పూలతో ముస్తాబు చేసిన గణపయ్యను ప్రత్యేక వాహనంపై పెట్టి నిమజ్జనానికి తీసుకెళ్లారు. యువకులు ఉత్సాహంగా నృత్యాలు చేశారు.. భక్తుల నినాదం మారోమ్రోగింది . గణపయ్య ఊరేగింపు మొత్తం పల్లె పండుగను తలపించింది.గణపతి బప్పా మోరియా.. గణపయ్యా మళ్లీ రావయ్యా అంటూ భక్తులు గొంతెత్తి నినదిస్తూ తమ గణపయ్యకు ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. భక్తిశ్రద్ధల మధ్య నిమజ్జనం ఘనంగా నిర్వహించారు.తొమ్మిది రోజులు అందరినీ ఒక్కచోట చేర్చి భక్తి పంచిన గణపయ్య.. హిమాయత్ సాగర్ నీళ్లలో కలిసిపోయిండు కానీ, పంచిన ఆనందం.. మిగిల్చిన జ్ఞాపకాలు మాత్రం అందరి మనసుల్లో అలాగే నిలిచిపోయాయి.

# డీజే మోత...మృత్యుఘోష

- డీజే దరువుకు ఆగిన ఆరు గుండెలు
- గణేష్ శోభాయాత్ర వేడుకల్లో విషాదాలు




**ప్రజా వాయిస్, హుజూర్ నగర్, సెప్టెంబర్ 23** భక్తి పారవశ్యంతో సాగాల్సిన వినాయక నిమజ్జన వేడుకలు ఈసారి విషాదాన్ని మిగిల్చాయి. డీజేల భారీ మోత, గంటల తరబడి నృత్యాలు, నిద్రలేమి..వెరసి యువ గుండెలు ఆగిపోయాయి. తెలుగు రాష్ట్రాల్లో కేవలం రెండు రోజుల వ్యవధిలోనే ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం కలకలం రేపుతుంది.ఊరేగింపులో ఉత్సాహంగా డ్యాన్స్ చేసిన యువకుడు ఇంటికి చేరి కుప్పకూలాడు. మరొకరు శోభాయాత్ర మధ్యలోనే నేల కొరిగాడు. నిమజ్జనం అనంతరం ఇంటికి వెళ్లిన మహిళ గుండెపోటుతో తుదిశ్వాస విడిచింది. ఇలా ఒక్కొక్క ఘటన.. ఒక్కో కుటుంబంలో తీరని శోకాన్ని నింపింది.నల్గొండ జిల్లా తిరుమలగిరి మండలంలో శోభాయాత్రలో డ్యాన్స్ చేసిన రాము (34) ఇంటి వద్దకు చేరుకున్న అనంతరం కుప్పకూలి మృతి చెందాడు. ఏపీలోని తాడేపల్లిగూడెంలో నిమజ్జన ఊరేగింపులో డ్యాన్స్ చేస్తూ కాకర్లమూడి ఏసు కుప్పకూలి మృతి చెందాడు. కర్నూలు రూరల్ మండలం ఇ.తాండ్రపాడులో శివమ్మ (36), డోన్‌లో గణేశ్‌గౌడ్ (23) కూడా నిమజ్జన వేడుకల అనంతరం గుండెపోటుతో మృతి చెందినట్లు సమాచారం. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సోమందేపల్లికి చెందిన శ్రీకాంత్ (35), గుత్తిలో అశోక్‌కుమార్ (28) కూడా ఊరేగింపుల్లో కుప్పకూలి మృతి చెందారు.

### వైద్య నిపుణులు హెచ్చరిక

అధిక డెసిబెల్ శబ్దం, తీవ్ర శారీరక శ్రమ, నీటి కొరత, నిద్రలేమి గుండెపై భారాన్ని పెంచుతాయని, ముందే గుండె సమస్యలు ఉన్నవారికి ఇది ప్రాణాంతకంగా మారవచ్చని చెబుతున్నారు. నిబంధనల ప్రకారం డీజే శబ్ద పరిమితులు ఉన్నా ఆచరణలో పట్టింపు కరువైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వేడుకల నిర్వాహకులు స్వచ్ఛందంగా శబ్ద నియంత్రణ పాటించాలని, పోలీసు, కాలుష్య నియంత్రణ అధికారులు కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

### ముగింపు వ్యాఖ్య

వినాయక నిమజ్జనం అనేది ఒక ఉత్సవానికి ముగింపు మాత్రమే కాదు.. కుటుంబం మొత్తం కలిసి పాల్గొనే పవిత్రమైన ఆధ్యాత్మిక కార్యక్రమం. అందులో పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు మరియు గుండె జబ్బులు ఉన్నవారు కూడా ఉంటారు. భక్తి పేరుతో మోత పెంచడం కంటే.. సాంప్రదాయ మంగళవాయిద్యాలతో, క్రమశిక్షణతో గణపతిని సాగనంపడం ముఖ్యం. ఒక్క పాట ఆపితే వేడుక ఆగదు, డీజే సౌండ్ తగ్గిస్తే ఉత్సాహం తగ్గదు. కానీ, ఒకే ఒక్క నిర్లక్ష్యం కారణంగా ఒక ప్రాణం ఆగిపోతే మాత్రం.. ఆ కుటుంబంలో ఆనందం శాశ్వతంగా ఆగిపోతుంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, ఉత్సవ కమిటీలు డీజే సంస్కృతికి స్వస్తి పలకాలని సంకల్పించాలి. భక్తి ఉండాలి కానీ ప్రాణాలను పణంగా పెట్టే స్థాయిలో మోతలు ఉండొద్దని వచ్చే ఏడాది నుండైనా ఈ విషాదాలు పునరావృతం కాకుడదని ఆకాంక్షిద్దాం

## పోలీసుల విధులకు ఆటంకం..వ్యక్తి అరెస్ట్

- పోలీసు వాహనాన్ని ఢీకొట్టి తప్పించుకునే యత్నం
- విధుల్లో ఉన్న సిబ్బందితో దుర్భాషలాడినట్లు ఆరోపణ
- కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ కు తరలింపు
- పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



**ప్రజా వాయిస్, కొడకండ్ల:** పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిని కొడకండ్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జనగామ జిల్లా కొడకండ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని హాక్యాతండాకు చెందిన వాంకుడోతు ప్రకాష్ (తండ్రి రాంగ్యా)ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 22న డయల్ 112కు అందిన సమాచారం మేరకు కొడకండ్ల శివారులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో బ్లూకోల్ట్స్ సిబ్బంది పీసీ–3668 సుంకరి రాకేష్, పీసీ–3354 కె.వెంకటేష్ విధులు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో అనుమానాస్పదంగా ట్రాక్టర్‌పై వెళ్తున్న ప్రకాష్‌ను పోలీసులు గమనించారు.పోలీసులు ఆపేందుకు ప్రయత్నించగా ట్రాక్టర్‌తో పోలీసు వాహనాన్ని ఢీకొట్టి అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. అంతేకాక విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో దుర్భాషలాడుతూ విధులకు ఆటంకం కలిగించినట్లు పేర్కొన్నారు. దీంతో ఘటనపై కేసు నమోదు చేసి ప్రకాష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

### విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధులు నిర్వహిస్తున్న పోలీసులకు ఆటంకం కలిగించడం, విధుల్లో ఉన్న సిబ్బందిపై దాడికి పాల్పడటం లేదా దురుసుగా వ్యవహరించడం వంటి చర్యలను సహించబోమని కొడకండ్ల పోలీసులు హెచ్చరించారు. చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



## అగ్రిమెంట్లు ఏవీ..?.. సర్టిఫికెట్లు ఎక్కడ..?

- దళితులకు భూములిచ్చామంటే ఆధారాలేవీ..?
- 1963లో ప్రభుత్వానికి భూములిచ్చామన్న వాదనపై దళితుల ప్రశ్నలు
- అధికారిక పత్రాలు, అగ్రిమెంట్లు, పూర్తి ఫైలు బయటపెట్టాలని డిమాండ్
- భూ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి
- కలెక్టర్ , ఎస్సీ,ఎస్టీ కమిషన్ , డీజీపీకి ఫిర్యాదు చేస్తామని ప్రకటన

**ప్రజావాయిస్,సిద్దిపేట :** దళితులకు భూములు ఇచ్చామని ముకిస పాపిరెడ్డి, సత్యనారాయణరెడ్డి చేసిన ప్రకటనలపై దళితులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశంలో భూములకు సంబంధించిన అధికారిక పత్రాలను చూపలేదని ఆరోపించారు. 1963లో ఎస్సీ కాలనీ వాసుల ఇళ్ల నిర్మాణం కోసం స్వచ్ఛందంగా ప్రభుత్వానికి భూములు ఇచ్చామని చెబుతున్న నేపథ్యంలో.. అందుకు సంబంధించిన ఆధారాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.అప్పట్లో భూములను ఏ అధికారి సమక్షంలో ప్రభుత్వానికి అప్పగించారు అగ్రిమెంట్ ఎక్కడ జరిగింది ప్రభుత్వానికి భూములు ఇచ్చినట్లు ఉన్న అధికారిక కాపీలు ఎక్కడ ఉన్నాయి ప్రభుత్వం భూములు స్వీకరించినట్లు ఉన్న రికార్డులు ఏమిటి? కన్సల్టేషన్ సర్టిఫికెట్‌తో పాటు సంబంధిత పూర్తి ఫైలు ఎక్కడ ఉందని ప్రశ్నించారు.ఎలాంటి ఆధారాలు చూపకుండా దళితుల పేరును ఉపయోగించుకుని ప్రభుత్వ భూములపై హక్కులు కల్పించుకునే ప్రయత్నం జరుగుతోందని దళిత సంఘాల ప్రతినిధులు ఆరోపించారు. ఈ వ్యవహారంలో వాస్తవాలను నిగ్గుతేల్చేందుకు సమగ్ర విచారణ జరపాలని కోరారు. సంబంధిత రికార్డులన్నింటినీ పరిశీలించి నిజానిజాలు తేల్చాలని విజ్ఞప్తి చేశారు.ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్, రాష్ట్ర డీజీపీతో పాటు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు దళిత సంఘాలు వెల్లడించాయి. బాధితులకు న్యాయం జరిగే వరకు, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశాయి.

# క్యాన్సర్ పరీక్షలకు..పరికరాలు 'కరువు'.!

- భువనగిరి జిల్లా ఆసుపత్రిలో బ్రెస్ట్ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలపై ఆందోళన
- పరికరాలున్నా పనిచేయవా..? టెక్నీషియన్లు లేక మూలనపడ్డాయా..?
- హెచ్ ఓడీ ఒక్కరే.. రోగులకు ప్రైవేట్ డయాగ్నస్టిక్ కేంద్రాలే దిక్కు..?
- ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలంటున్న ప్రజలు







**ప్రజా వాయిస్,భువనగిరి :**క్యాన్సర్.. పేరు వింటేనే గుండెల్లో దడ. తొలిదశలో గుర్తించి చికిత్స అందిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా మహిళల్లో కనిపించే బ్రెస్ట్ క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించేందుకు అవసరమైన పరీక్షలు అందుబాటులో ఉండటం అత్యంత కీలకం. అయితే యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోనే బ్రెస్ట్ క్యాన్సర్‌కు సంబంధించిన పరీక్షల పరిస్థితిపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవసరమైన సాంకేతిక పరికరాలు పనిచేయడం లేదని, కొన్ని పరికరాలు ఉన్నా వాటిని నిర్వహించేందుకు టెక్నీషియన్లు లేరని రోగులు, వారి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ వైద్యంపై ఆధారపడే పేదలకు పరీక్షల కోసం ప్రైవేట్ కేంద్రాలే దిక్కవుతున్నాయని వాపోతున్నారు.

### పరికరాలున్నా.. ప్రయోజనం ఏది..?

బ్రెస్ట్ క్యాన్సర్ నిర్ధారణకు అవసరమైన సాంకేతిక పరికరాలు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నప్పటికీ అవి సక్రమంగా పనిచేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. యంత్రాల్లో సాంకేతిక సమస్యలుంటే మరమ్మతులు ఎందుకు చేపట్టడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పరికరాల నిర్వహణకు అవసరమైన సిబ్బంది లేకపోవడమే అసలు సమస్యా? అన్నది కూడా చర్చనీయాంశంగా మారింది.

### హెచ్ ఓడీ ఒక్కరే.. సిబ్బంది ఏరీ..?

సంబంధిత విభాగంలో హెచ్‌ఓడీ ఒక్కరే ఉండటం, అవసరమైన టెక్నీషియన్లు అందుబాటులో లేకపోవడం వల్ల పరీక్షలు, వైద్య సేవలకు ఆటంకం ఏర్పడుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. పరికరాలు ఉన్నా వాటిని వినియోగించే సాంకేతిక సిబ్బంది లేకపోతే ప్రభుత్వ నిధులతో సమకూర్చిన యంత్రాల ప్రయోజనం ఏమిటన్న ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

### ప్రైవేట్ కేంద్రాలకే ఎందుకు..?

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే కొందరు రోగులను ఆసుపత్రికి ఎదురుగా ఉన్న ప్రైవేట్ డయాగ్నస్టిక్ కేంద్రాలకు పంపుతున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అక్కడ పరీక్షలు చేయించుకున్న అనంతరం కొంతమంది రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారన్న ఆరోపణలపైనా సమగ్ర విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

### పేదలపై అదనపు భారం

ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో అందాల్సిన పరీక్షలు బయట చేయించుకోవాల్సి వస్తే పేద కుటుంబాలపై ఆర్థిక భారం పడుతుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరీక్షల ఖర్చుతో పాటు ప్రయాణం, తదుపరి వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తే పరిస్థితి మరింత భారంగా మారుతుందని అంటున్నారు.

### క్యాన్సర్ విషయంలో నిర్లక్ష్యం వద్దు

బ్రెస్ట్ క్యాన్సర్ వంటి వ్యాధులను తొలిదశలో గుర్తించడం వైద్యపరంగా కీలకమైన నేపథ్యంలో పరీక్షలలో జాప్యం జరగకూడదని ప్రజలు కోరుతున్నారు. జిల్లాలో గతంలో ఈ వ్యాధితో పలువురు మృత్యువాత పడిన విషయాన్ని గుర్తుచేస్తూ.. ప్రభుత్వ ఆసుపత్రిలోనే అవసరమైన పరీక్షలు, వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు.

### జిల్లా ఆసుపత్రిలోనే ఇలా ఉంటే..

జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలోనే బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షల పరిస్థితి ఇలా ఉంటే.. మండల స్థాయి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల పరిస్థితి ఎలా ఉంటుందన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. పేదలకు భరోసాగా నిలవాల్సిన ప్రభుత్వ వైద్య వ్యవస్థలో కీలకమైన పరీక్షలు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగించే అంశమని పలువురు అంటున్నారు.

### విచారణ జరిపి.. వాస్తవాలు తేల్చాలి

పరికరాలు పనిచేయకపోవడానికి కారణాలేంటి మరమ్మతులు ఎందుకు చేపట్టలేదు టెక్నీషియన్ల నియామకంలో జాప్యం ఎందుకు రోగులను ప్రైవేట్ కేంద్రాలకు పంపుతున్నారన్న ఆరోపణల్లో వాస్తవమెంత అనే అంశాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఆసుపత్రి ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు. పనిచేయని పరికరాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావడంతో పాటు అవసరమైన సిబ్బందిని నియమించి బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షలు, వైద్యం ప్రభుత్వ ఆసుపత్రిలోనే పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## భూ రికార్డుల మార్పిడికి అడ్డాగా గుండాల తాహాసిల్దార్ కార్యాలయం!

- 30 లక్షల తీసుకొని 9 ఎకరాల భూ రికార్డులు మాయం !
- సర్వే నెంబర్లు మార్చారని బాధితుడి లక్ష్మారెడ్డి ఆరోపణ

**ప్రజా వాయిస్,గుండాల సెప్టెంబర్ 23:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల తాహాసిల్దార్ కార్యాలయంలో సర్వే నెంబర్లను తొలగించి భూ రికార్డులు మార్చి అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన వైనం వెలుగులోకి వచ్చింది.వివరాల్లోకి వెళితే గుండాల మండల పరిధిలోని నూనెగూడెం గ్రామం సంబంధించిన రైతు ఆలేటి మల్లారెడ్డికి నలుగురు కుమారులు కాగా అందులో నాలుగో కుమారుడు లక్ష్మారెడ్డి తన భాగానికి వచ్చిన 237,238 సర్వే నెంబర్లు 9.05 ఎకరాల భూమిని 30 ఏళ్లగా కబ్జాలో ఉండి సాగు చేసుకుంటున్నాడు.ఆ భూమిపై వివాదంతో పాటు కోర్టులో కేసు కూడా నడుస్తుంది. ఆలేటి సుజాత,ఆలేటి కృష్ణారెడ్డి,ఆలేటి సంజీవరెడ్డి కలిసి మిస్సింగ్ నెంబర్ తో ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రయత్నించగా అప్పటి తహసిల్దార్ రిజెక్ట్ చేశారు, 2014 ముందు ఉన్న మూడు రకాల పహాని రికార్డులను మార్చడంతో పాటు భూభారతిలో చూపించిన 237,238 సర్వే నెంబర్లను తొలగించి వాటి స్థానంలో కొత్త సర్వే నెంబర్లు సృష్టించి 9.05 ఎకరాల భూమిని ముగ్గురు వ్యక్తులకు ప్రస్తుత తాహాసిల్దార్ హరికృష్ణ,ఆర్ ఐ ప్రభుదాస్ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు లు కలిసి రికార్డులను మార్చి 30 లక్షల రూపాయలను తాహాసిల్దార్ కార్యాలయం వారు తీసుకొని రిజిస్ట్రేషన్ చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నాకు తగిన న్యాయం చేయాలని లేని పక్షంలో తాహాసిల్దార్ కార్యాలయం ఎదుటని ఆత్మహత్య చేసుకుంటానని నా చావుకు కారణం ప్రభుత్వం, తాహాసిల్దార్ కార్యాలయం మాత్రమేనని అన్నారు.ఇట్టి విషయాన్ని తాహాసిల్దార్ హరికృష్ణ ను,ఆర్ఐ ప్రభుదాస్ లను ప్రజా వాయిస్ రిపోర్టర్ వివరణ కొరకు ఫోన్ చేయగా వాళ్ళు స్పందించలేదు.





## దేవుడి భూములపై కబ్జా కళ్లు... బీజేపీ ఆగ్రహం

- ఫణిగిరి దేవాలయ భూముల ఆక్రమణ
- బాధితుల ఆవేదనదేవుడి భూములపై భూబకాసురుల కన్ను...రక్షణ ఏది?

**ప్రజా వాయిస్, హుజూర్‌నగర్**, సెప్టెంబర్ 23హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలోని ఫణిగిరి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ దేవాదాయ భూముల ఆక్రమణపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. హుజూర్‌నగర్ బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్ గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు వివాదాస్పద భూములను పరిశీలించారు. నాలుగు తరాలుగా ఆ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాలను పక్కనపెట్టి, ఇతరులకు హక్కులు కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని బాధితులు వాపోయారు. ఈ సందర్భంగా హరీష్ గౌడ్ మాట్లాడుతూ దేవుడి మాన్యం భూముల పరిరక్షణ బాధ్యత దేవాదాయ శాఖ, ప్రభుత్వ యంత్రాంగంపై ఉందని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు అన్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటే బీజేపీ ఊరుకోదని హెచ్చరించారు. ఈ ఆక్రమణ ప్రక్రియ వెనుక అధికార పార్టీ నేతల హస్తం ఉందని ఆరోపించారు. భూముల రికార్డులు, సాగు హక్కులు, శిస్తు వివరాలు సమగ్రంగా పరిశీలించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని పార్టీ రాష్ట్ర నాయకత్వానికి తెలియజేస్తామని, బాధితులకు న్యాయం జరిగేవరకు పోరాటం కొనసాగిస్తామని హరీష్ గౌడ్ హామీ ఇచ్చారు.

## వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- ముళ్లకట్ట గోదావరి వంతెన వద్ద భద్రతా చర్యల పరిశీలన
- భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు
- అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ శ్రీలత లక్ష్మణ్ బాబు సూచన
- నిమజ్జన ప్రాంతంలో పోలీసు సిబ్బందితో ప్రత్యేక భద్రత

**ప్రజా వాయిస్, ములుగు జిల్లా/ఏటూరునాగారం:** వినాయక నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టినట్లు ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్‌బాబు తెలిపారు. మండలంలోని ముళ్లకట్ట గోదావరి వంతెన వద్ద నిమజ్జనం కోసం చేపట్టిన ఏర్పాట్లను బుధవారం ఆమె పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు భద్రతా చర్యలు పటిష్టంగా ఉండేలా సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు.గోదావరి నదిలో నిమజ్జనం సందర్భంగా భక్తులు అప్రమత్తంగా ఉండాలని, పోలీసు, ఇతర సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటించాలని సర్పంచ్ సూచించారు. నదిలో లోతైన ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కాకులమర్రి ప్రదీప్‌రావు, తుమ్మ మల్లారెడ్డి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు కూనూరు అశోక్‌గౌడ్, ఎండీ వలీబాబా, కర్ర రవీందర్, గండేపల్లి నరసయ్య, కాకులమర్రి భాస్కర్‌బాబు, కార్యదర్శి జనార్ధన్, అరుణమ్మతో పాటు స్థానిక పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కొండగట్టుపై ఆర్టీసీ బస్సులు నడపాలి

- ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ పేద భక్తులపై అదనపు భారం
- రవాణా మంత్రి పొన్నం, చొప్పదండి ఎమ్మెల్యే స్పందించాలి
- గర్భగుడి దక్షిణ మార్గంలోని సీతమ్మ విగ్రహానికి మరమ్మతులు చేపట్టాలి
- రాష్ట్ర దళిత సంఘం ప్రధాన కార్యదర్శి వనతడుపుల అంజయ్య డిమాండ్

**ప్రజా వాయిస్,కోరుట్ల:** కొండగట్టు అంజనేయస్వామి ఆలయానికి ఆర్టీసీ బస్సు సర్వీసులు లేకపోవడంతో పేద, సామాన్య భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర దళిత సంఘం ప్రధాన కార్యదర్శి, కల్లూరు మాజీ సర్పంచ్ వనతడుపుల అంజయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయానికి వచ్చే భక్తులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని, దీంతో వారిపై అదనపు ఆర్థిక భారం పడుతోందని తెలిపారు.కొండగట్టు పుణ్యక్షేత్రానికి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్న నేపథ్యంలో గుట్టపైకి ఆర్టీసీ బస్సు సర్వీసులను వెంటనే పునఃప్రారంభించాలని కోరారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక చొప్పదండి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని భక్తుల రవాణా సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ఆలయ గర్భగుడి దక్షిణ మార్గంలో ఉన్న సీతమ్మవారి విగ్రహం చెయ్యి విరిగిపోయి చాలాకాలంగా అలాగే ఉందని అంజయ్య పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని విగ్రహానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆలయ అధికారులు, సంబంధిత శాఖల అధికారులను కోరారు. కొండగట్టు ఆలయంలో భక్తులకు మెరుగైన రవాణా, మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## ఇబ్రహీంపేటలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- అందర్ –బహార్ ఆడుతున్న 9 మంది అరెస్ట్
- రూ.8,100 నగదు, 52 పేకముక్కలు, 6 సెల్ ఫోన్లు స్వాధీనం
- హాలియా ఎస్ఐ. బండి సాయిప్రశాంత్.

**ప్రజా వాయిస్,హాలియా.** ఇబ్రహీంపేట గ్రామంలో అందర్–బహార్ పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని హాలియా పోలీసులు పట్టుకున్నారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారంతో బుధవారం హాలియా ఎస్ఐ బి. సాయి ప్రశాంత్ సిబ్బందితో కలిసి ఇబ్రహీంపేటలోని విశ్వనాధుల వెంకటాచారి ఇంటి ఆవరణలో దాడి నిర్వహించారు.హాలియా ఎస్ఐ. బండి సాయిప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం పోలీసుల సిబ్బందిని గమనించిన పేకాటరాయుళ్లు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు వెంబడించి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నామని,వారి నుంచి పందెం సొమ్ముగా ఉన్న రూ.8,100 నగదు, 52 పేకముక్కలు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.పట్టుబడిన వారిలో పాతనబోయిన సైదులు, అనుముల మధు, చాపల మహేష్, వజ్జ యాదయ్య, విశ్వనాధుల సైదాచారి, కంభంపాటి సైదులు, నాగిళ్ల ఆంజనేయులు, ఈగల ప్రశాంత్, అనుముల దుర్గయ్య ఉన్నట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.పేకాట, జూదం, బెట్టింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. గ్రామాల్లో ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.



# నల్లగా మారిన కోడిగుడ్లు.!

- బాలింతలు, చిన్నారులకు పంపిణీ
- బోడంపహాడ్ అంగన్ వాడీ కేంద్రంలో కలకలం
- కుళ్లిన గుడ్ల సరఫరాపై గ్రామస్తుల ఆగ్రహం
- అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు డిమాండ్

**ప్రజా వాయిస్,షాబాద్ :**బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నా.. క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం ఆందోళనకు గురిచేస్తోంది. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం బోడంపహాడ్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, చిన్నారులకు పంపిణీ చేసేందుకు వచ్చిన కోడిగుడ్లలో కొన్ని నల్లగా మారి కనిపించడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### పగులగొడితే దుర్వాసన..

అంగన్‌వాడీ కేంద్రంలో వచ్చిన గుడ్లను పగులగొట్టి చూడగా లోపల నల్లటి రంగులోకి మారడంతో పాటు ఘాటైన దుర్వాసన వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో వాటిని లబ్ధిదారులకు ఎలా పంపిణీ చేస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. నాణ్యత లేని ఆహారం తినడం



వల్ల చిన్నారులు, బాలింతల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### నాణ్యత పరిశీలన ఏదీ..?

అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే పౌష్టికాహార పదార్థాలను పంపిణీకి ముందు సంబంధిత సిబ్బంది, అధికారులు నాణ్యతను పరిశీలించాల్సి ఉంటుందని గ్రామస్తులు పేర్కొన్నారు. అయితే గుడ్ల నాణ్యతను పరిశీలించకుండా పంపిణీ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ నాసిరకం గుడ్లు సరఫరా చేశారా? అధికారులు తనిఖీలు ఎందుకు నిర్వహించలేదనే విషయాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

### బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ఘటనపై జిల్లా కలెక్టర్, ఐసీడీఎస్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి గుడ్ల నాణ్యతపై సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. నాసిరకం గుడ్లు సరఫరా చేసినట్లు తేలితే సంబంధిత కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# వినాయక లడ్డూకు రూ.3.11 లక్షలు


- శంషాబాద్ న్యూ హుడా కాలనీలో హోరాహోరీగా సాగిన వేలం



**ప్రజా వాయిస్//శంషాబాద్:** న్యూ హుడా కాలనీలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో లడ్డూ వేలం ఉత్కంఠగా సాగింది. భక్తులు పోటీపడగా, దేవరంపల్లి మల్లారెడ్డి దంపతులు రూ.3.11 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు.అదేవిధంగా వినాయకుడి పట్టు పంచను పాంత్య శ్రీను దంపతులు రూ.40 వేలకు సొంతం చేసుకున్నారు. వేలం కార్యక్రమంలో కాలనీ వాసులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.వినాయకుడి కృపతో కాలనీలో సుఖ సంతోషాలు, శాంతి,సమృద్ధి నెలకొనాలని భక్తులు ఆకాంక్షించారు.

# విగ్రహం అదుపుతప్పి.. రివర్స్

- క్రేన్ తో నిమజ్జనం చేస్తుండగా స్వల్ప గందరగోళం
- విగ్రహం కిందకు జారడంతో నిలిచిన ప్రక్రియ
- క్రేన్ ను రివర్స్ లో తీసుకొచ్చి సరిచేసిన సిబ్బంది
- ఆ తర్వాత యథావిధిగా నిమజ్జనం



**ప్రజా వాయిస్,సూర్యాపేట:** సద్దుల చెరువు నిమజ్జన ప్రాంతంలో గణేష్ విగ్రహం నిమజ్జనం సందర్భంగా స్వల్ప గందరగోళం చోటుచేసుకుంది. క్రేన్ ద్వారా విగ్రహాన్ని చెరువులోకి దించుతున్న సమయంలో సరిగ్గా అమర్చకపోవడంతో విగ్రహం ఒక్కసారిగా అదుపుతప్పి కిందకు జారింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది నిమజ్జన ప్రక్రియను కొద్దిసేపు నిలిపివేశారు. అనంతరం క్రేన్‌ను రివర్స్‌లో వెనక్కి తీసుకొచ్చి విగ్రహాన్ని సరిచేశారు. పరిస్థితిని అదుపులోకి తీసుకున్న తర్వాత విగ్రహాన్ని జాగ్రత్తగా చెరువులో నిమజ్జనం చేశారు. ఈ ఘటనతో నిమజ్జన ప్రాంతంలో కొద్దిసేపు ఉత్కంఠ నెలకొన్నా.. ఎలాంటి అవాంఛనీయ ఘటన చోటుచేసుకోలేదు.

# సరళ మైసమ్మ దేవాలయంలో కుమ్మర్లకు హక్కులు కల్పించాలి

### నారాయణపురం కుమ్మరి సంఘం అధ్యక్షుడు లారీ బిక్షం

**ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని రాచకొండ సరళ మైసమ్మ దేవాలయంలో గ్రామ పూజారులుగా నారాయణపురం కుమ్మర్లకు హక్కులు కల్పించాలని కోరుతూ బుధవారం తహసీల్దార్‌తో పాటు స్థానిక ఎంపీడీవోకు కుమ్మరి సంఘం తరపున వినతిపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా కుమ్మరి సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు చిలువేరు లారీ బిక్షం మాట్లాడుతూ. నారాయణపురం రెవెన్యూ పరిధిలోని రాచకొండ గ్రామంలో ఉన్న సరళ మైసమ్మ దేవాలయం వద్ద తమ కులవృత్తిలో భాగంగా, సాంప్రదాయ గ్రామ పూజారులుగా అవకాశం కల్పించాలని కోరారు. హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించి అధికారులు, స్థానిక గ్రామస్తులు కూడా తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దేవాలయం వద్ద తమకు సరైన ప్రాతినిధ్యం లభించేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం ప్రధాన కార్యదర్శి చిలువేరు సైదులు, ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి గాలయ్య, సంఘ సభ్యులు చిలువేరు అంజయ్య, చిలువేరు శంకర్, చిలువేరు ముత్యాలు, చిలువేరు క్రిష్టయ్య, సత్తయ్య, బిక్షమయ్య, వెంకులు, రత్తుపల్లి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



# మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రజాదరణ చూసి భయం

- రామగుండంలో విచక్షణారహిత రాజకీయాలు!
- అభివృద్ధి శిలాఫలకాల కూల్చివేత..
- పుట్టినరోజు ఫ్లెక్సీల తొలగింపు
- పైశాచిక ఆనందం లో కాంగ్రెస్ నాయకులు!
- కార్పొరేషన్ అధికారులను అడ్డుపెట్టుకొని ప్రతీకార రాజకీయాలు
- బిఆర్ఎస్ శ్రేణుల మండిపాటు
- చందర్ తెచ్చిన నిధులు, చేసిన అభివృద్ధి చెరిగిపోవు
- ఫ్లెక్సీలు తొలగించిన ప్రజల గుండెల్లో ఆయన ముద్ర పదిలం!



**ప్రజా వాయిస్ గోదావరిఖని** పారిశ్రామిక ప్రాంతమైన రామగుండంలో రాజకీయ కక్షసాధింపు చర్యలు పరాకాష్ఠకు చేరాయి. ఒకవైపు మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు కోరుకంటి చందర్ జన్మదినం, వినాయక చవితి పండుగ శుభాకాంక్షల ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులు దౌర్జన్యంగా తొలగించడం, మరోవైపు ఆయన హయాంలో ప్రారంభించిన, ప్రారంభోత్సవాలు జరుపుకున్న అభివృద్ధి పనుల శిలాఫలకాలను విచక్షణారహితంగా కూల్చివేస్తుండటం తీవ్ర ఆగ్రహావేశాలకు దారితీస్తోంది. అధికార కాంగ్రెస్ నాయకుల కండ్లమంటతో, మున్సిపల్ యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని సాగిస్తున్న ఈ ప్రతీకార రాజకీయాన్ని బిఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండిస్తున్నాయి.

### అభివృద్ధి చేసినందుకు ఇదా బహుమతి? శిలాఫలకాలపై కాంగ్రెస్ చిల్లర కక్ష!

ఎమ్మెల్యేగా కోరుకంటి చందర్ హయాంలో రామగుండం నియోజకవర్గం మునుపెన్నడూ లేని విధం గా అభివృద్ధి బాట పట్టింది. కోట్లాది రూపాయల నిధులు తీసుకువచ్చి కార్మిక క్షేత్రంలో నూతన రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్లు, సుందరీకరణ పనులు చేపట్టి, వాటి జ్ఞాపకంగా వేసిన ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఇప్పుడు కక్షగట్టి కూల్చివేయడంపై ప్రజలు అసహ్యం వ్యక్తం చేస్తున్నారు. శిలాఫలకాలు పగలగొడితే చందర్ చేసిన అభివృద్ధి చెరిగిపోతుందా? ఆయన తెచ్చిన నిధులతో రూపుదిద్దుకున్న రోడ్లు, భవనాలు కనిపించకుండా పోతాయా? కాంగ్రెస్ నాయకులకు దమ్ముంటే ఆయన కంటే ఎక్కువ నిధులు తెచ్చి అభివృద్ధి చేసి చూపించాలి తప్ప.. ఇలా రాత్రికి రాత్రే శిలాఫలకాలను ధ్వంసం చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనం అని స్థానిక బిఆర్ఎస్ నాయకులు దుయ్యబట్టారు.

### అభిమానానికి ఆంక్షలు.. దేవుళ్ల బొమ్మల పట్లా అనాదరణ!

మరోవైపు ప్రజాసేవే పరమావధిగా నిరంతరం ప్రజల్లో ఉండే కోరుకంటి చందర్ అంటే రామగుండం ప్రజలకు, బిఆర్ఎస్ కార్యకర్తలకు ఎంతో అభిమానం. ఆయన జన్మదినాన్ని, గణేష్ ఉత్సవాలను పురస్కరించుకుని గులాబీ శ్రేణులు సొంత ఖర్చులతో, ఎంతో వేడుకగా నగరమంతటా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే, అధికారులు స్పెషల్ డ్రైవ్ పేరుతో విగ్నేశ్వరుని చిత్రపటాలు, పుట్టినరోజు శుభాకాంక్షల బ్యానర్లను అమానుషంగా చింపివేసి చెత్త బండ్లలో పడేయడం భక్తుల, అభిమానుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసింది.

### రౌడీ పాలనను తలపిస్తున్న తీరు

అధికారులకు హెచ్చరిక మున్సిపల్ సిబ్బంది ఏకపక్ష చర్యలపై స్థానిక బిఆర్ఎస్ నాయకులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రస్తుత రామగుండంలో ప్రజాస్వామ్య బద్ధమైన పాలన సాగడం లేదని, రౌడీ పాలనను తలపించేలా అధికార పక్షం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, ప్రజల్లోకి వెళ్లలేకపోతున్న కాంగ్రెస్ నాయకులు.. ప్రతిపక్ష నేత ప్రజాదరణను చూసి ఓర్వలేకనే ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. అధికారులు చట్టబద్ధంగా వ్యవహరించాలని, అధికార పార్టీకి తొత్తులుగా మారి శిలాఫలకాల కూల్చివేత, ఫ్లెక్సీల తొలగింపు వంటి కక్షసాధింపు చర్యలకు సహకరిస్తే రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఫ్లెక్సీలు నిషేధమని చెప్తున్న అధికారులు.. ధైర్యముంటే అందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులను (జీవో) బయటపెట్టాలని డిమాండ్ చేశారు.



# బూర్గంపాడులో గాలివాన బీభత్సం.. ఒక్కసారిగా చీకట్లు..!

- మొరంపల్లి బంజరలో అర్నబ్ తుఫాన్ విధ్వంసం
- ఏం జరుగుతుందో అర్థంకాని పరిస్థితి
- దుమ్ము, నల్లటి మేఘాలతో భయానక వాతావరణం
- గాలికి ఎగిరిన చెట్లు, రేకులు.. మనుషులనూ కొంతదూరం నెట్టేసిన ఈదురుగాలులు
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు
- స్వల్ప గాయాలతో బయటపడ్డ బాధితులు

**ప్రజా వాయిస్,బూర్గంపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం మొరంపల్లి బంజరలో ఒక్కసారిగా తుఫాన్ బీభత్సం సృష్టించింది. క్షణాల్లోనే వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఆకాశం నల్లటి మేఘాలతో కమ్ముకుని.. చుట్టూ దట్టమైన దుమ్ము అలుముకోవడంతో స్థానికులు ఏం జరుగుతుందో తెలియక భయాందోళనకు గురయ్యారు.తీవ్ర వేగంతో వీచిన గాలులకు చెట్లు, ఇంటి రేకులు ఎగిరిపడ్డాయి. గాలి ఉద్ధృతికి మనుషులు సైతం కొంతదూరం నెట్టివేయబడినట్లు బాధితులు తెలిపారు. కళ్లముందే వస్తువులు గాల్లో ఎగురుతూ పడటంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు.

### అలాంటి దృశ్యం ఎప్పుడూ చూడలేదు

ఒక్కసారిగా చుట్టూ చీకట్లు కమ్ముకోవడం, భారీగా దుమ్ము లేవడం, నల్లటి మేఘాలతో భయానక వాతావరణం ఏర్పడటంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. "ఏం జరుగుతుందో అర్థం కాలేదు.. కాసేపు ప్రాణాలు పోతాయేమో అనిపించింది" అని బాధితులు పేర్కొన్నారు.అదృష్టవశాత్తూ పెద్ద ప్రమాదం తప్పింది. పలువురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టం, ఎగిరిపడిన చెట్లు, రేకులపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

# చోరీ కేసు నిందతుడు ఆత్మహత్య!?

- బంగారం దొంగతనం చేశారంటూ నింది తుడిపై కేసు నమోదు చేసిన వైనం!
- గత కొన్ని రోజులుగా పోలీసుల చిత్రహింసలే అంటూ భార్య ఆరోపణ!?
- పోలీస్ స్టేషన్ నుండి పారిపోయి ఆత్మహత్య చేసుకున్నాడని నాటకం!?
- సోమవారం పారిపోయిన భార్యను వదలని రక్షణ శాఖ!?
- ఎస్టీ మహిళని చూడకుండా దౌర్జన్యం చేసి అరెస్టు చేసిన వైనం!
- అరెస్టు సమయంలో మహిళా కానిస్టేబుల్ కూడా లేరని భార్య ఆరోపణ!?
- కడసారి చూపు కూడా దూరం పెట్టి స్టేషన్ లో కూర్చోబెట్టిన అధికారులు!
- మృతుడు పురుగుల మందు సేవించాడని చెప్పటంతో కంగుతున్న భార్య!?
- ఆత్మహత్య వెనక పోలీసులే ప్రధాన సూత్రధారులంటూ గిరిజన సంఘాలు డిమాండ్!?

**ప్రజా వాయిస్ అశ్వారావుపేట** రక్షించవలసిన వారే భక్షిస్తున్న సామెత వల్లే ఓ నిరుపేద గిరిజన యువకులను చోరీ కేసులో నిందితులుగా గుర్తించి కేసులు నమోదు చేసి విచారణ కొరకు స్థానిక పిఎస్ పిలిపించి చిత్రహింసలు గురిచేయడంతో బాధను భరించలేని ఆ యువకుడు చివరికి ఆత్మహత్య చేసుకునే స్థాయికి పేరపన జరిగిందంటే అధికారుల వైఖరి ఎంత విధి విధానాలతో కూడి ఉందో ఊహించుకుంటేనే భయం ఆందోళన కలిగిస్తుంది అంతేకాకుండా విచారణలో భాగంగా నిందితుడు తప్పించుకున్నాడని సాకుతో ఓ గిరిజన మహిళ అని చూడకుండా నిబంధనలకు విరోధంగా అర్ధరాత్రి అపరాత్రి అనే తేడా లేకుండా ఇంటిలోకి ప్రవేశించి అరెస్టులు చేసి స్టేషన్లో కూర్చోబెట్టి విచారణ పేరుతో హంగామా ఆర్భాటం చేయటం నగరంలో సంచలన సృష్టిస్తుంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని జమ్మిగూడెం గ్రామం నందు వర్గానికి చెందిన నాయకులు ఇంట్లో గ్రామానికి చెందిన గోల శెట్టి రఘురాం మరియు బంధువైన గోల శెట్టి నాగు అనే ఇరువురు వ్యక్తులు గత నెల రెండు నెలల క్రింద ఓ ఇంటిలో చోరీ చేసి నగదును మరియు బంగారాన్ని దొంగిలించటంతో సదర బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయడం జరిగింది. అప్పటనుండి విచారణ కొరకు నిందితులను పలుమార్లు పోలీస్ స్టేషన్ కి రావాలని సమాచారం ఇవ్వటంతో నిందితులు హాజరవ్వడం జరిగిందని గత వారం రోజులుగా ఇటువంటి విచారణ ఒత్తిడి మరింత వేగవంతం కావడంతో సోమవారం బాధితుడు ఒత్తిడితో అధికారులు నిందితులను జమ్మగూడెం గ్రామంలో అరెస్టు చేసి స్టేషన్ కి తరలించినట్లు కొందరు స్థానికులు మీడియా ముఖంగా తెలపడం జరిగింది. నిందితుడులో ఒకరైన గోళ్ళాశెట్టి నాగు అనే వ్యక్తి మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ నుండి తప్పించుకొని పోవటంతో సదర వ్యక్తి ఆచూకీ కోసం భార్య అయిన మొత్తం మంగళవారం ఉదయం 11 గంటలకి జమ్ముగూడెం గ్రామంలో అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించి విచారిస్తున్న సందర్భంలో సాయంత్రం మూడు గంటల సమయం నందు నిందితులలో ప్రధాన ముద్దాయన గోళ్ళ శెట్టి నాగు ఆత్మహత్యకు పాల్పడి ప్రాణాపాయ స్థితిలో ఉండగా భార్య మొత్తమకు స్థానిక అధికారులు భర్త క్రిమిసంహారమందును సేవించాడని సదర వ్యక్తి స్థానిక ప్రాథమిక హాస్పటల్ నందు వైద్యం సదుపాయం అందుతుందని తెలపడంతో ఒక్కసారిగా కంగుతిన్న భార్య ముత్తమ్మ స్థానిక వైద్యశాలకు భర్త నాగు వద్దకు చేరుకోగా అప్పటికే ఆరోగ్యం విషమించటంతో వైద్యులు చేతులెత్తేసినట్లు గ్రహించిన భార్య ఏమి జరిగిందోనని భర్తను సంప్రదించే సందర్భంలో కొందరు అధికారులు కూడా అడ్డగించారని ఇంతలోనే జరగాల్సిన నష్టం జరిగిపోయిందని భార్య ముత్తమ్మ మీడియా ముఖంగా తెలపడం జరిగింది

### నా భర్త చిత్రహింసల వల్లే మరణించాడు!?...భార్య మరియమ్మ

విచారణలో భాగంగా గత వారం నుండి పోలీస్ స్టేషన్ కి రావలసిందిగా నిందితులకు సమాచారం ఇచ్చిన అధికారులు పలుమార్లు హెచ్చరించటమే కాకుండా కొట్టారని అంతేకాకుండా చిత్రహింసలు గురి చేశారని బంగారం మరియు నగదు వివరాలు చెప్పాలని మానసికంగా ఇబ్బందులు పెట్టడంతో బాధను భరించలేని నా భర్త మందు తాగాడని నమ్మటానికి వీలులేదని విచారణలో భాగంగా స్టేషన్ లో ఉండవలసిన వ్యక్తి బయటకి ఎలా వదులుతారో చెప్పాలని నేరస్తులకు అన్ని సౌకర్యాలతో పాటు సెక్యూరిటీ కూడా ఏర్పాట్లు చేసే అధికారులు ఏ రూపంగా వదిలేస్తారో తెలపాలని ఎక్కడో బయట క్రిమి సంహార మందును తాగాడని చెప్పటమే కాకుండా భర్త వద్దకు వెళ్లకుండా ఎందుకు అడ్డగించారు తెలియదని భార్య మరియమ్మ విమర్శిస్తుంది.



### రాజకీయ వర్గ పోరులో అధికారులపై ఒత్తిడి!?

ప్రస్తుతం పట్టణ పరిధిలోని రెండు ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ యుద్ధం కొనసాగుతూనే ఉంది. ప్రధాన పార్టీ అయినా కాంగ్రెస్ వర్గానికి చెందిన బాధితుడు కావడంతో ప్రధాన నాయకుడు నుండి స్థానిక అధికారులకు పదేపదే ఒత్తిడి రావడం ఒక కోణం అయితే రెండో కోణం నిందితులు ఇరువురు కూడా బీఆర్ఎస్ వర్గానికి చెందినవారు కావడం వల్ల నిందితుడికి ఇటువంటి నష్టం జరిగిందని భారీగా పట్టణంలో గుసగుసలు వినిపిస్తున్నాయి నిజానికి రెండు వర్గాల మధ్య పోరు అమాయక ప్రజలు ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని రాజకీయాల్లో అమాయక యువకులే బలవుతున్నారే తప్ప బడా బాబులకు ఒరిగేదేమీ లేదని ఇటువంటి ఆత్మహత్య నిదర్శనమని మండలంలో భారీ స్థాయిలో విమర్శలను కొనసాగుతున్నాయి ఇప్పటికైనా బంగారం నగదు చోరీ కేసులో ప్రధాన ముద్దాయి అయినా గోళ్ళాశెట్టి నాగు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నలుగురు సంతానం కలిగిన పిల్లలకు తండ్రి లేకుండా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇటువంటి విధి విధానాలకు ప్రభుత్వం చెక్ పెట్టే విధంగా చట్టాలు తేవాలని అశ్వారావుపేట మండల ప్రజలు కోరుకుంటున్నారు.



# వినాయకుడి ఆశీస్సులు అందరిపై ఉండాలి

- రూ.91,501కు వినాయక లడ్డూను కైవసం చేసుకున్న ఎన్. మాధవరెడ్డి.
- శ్రీనగర్ కాలనీ'లో ఉత్సాహంగా సాగిన లడ్డూ వేలం.

**ప్రజా వాయిస్ కుత్బుల్లాపూర్:** సురారం మండలం:/శ్రీనగర్ కాలనీలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వినాయక లడ్డూ వేలం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు, కాలనీ వాసులు ఉత్సాహంగా వేలంలో పాల్గొనడంతో సందడి నెలకొంది.వినాయకుడి లడ్డూను దక్కించుకునేందుకు పలువురు ఆసక్తి చూపగా, చివరకు ఎన్. మాధవ రెడ్డి రూ.91,501 అత్యధిక ధరను ప్రకటించి లడ్డూను కైవసం చేసుకున్నారు. దీంతో ఉత్సవ ప్రాంగణంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. నిర్వాహకులు, స్థానికులు ఎన్. మాధవరెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా లడ్డూను కైవసం చేసుకున్న ఎన్. మాధవరెడ్డి మాట్లాడుతూ.....వినాయకుడి లడ్డూను వేలంలో దక్కించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. వినాయకుడి ఆశీస్సులు తన కుటుంబంతో పాటు శ్రీనగర్ కాలనీ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలు ప్రజల్లో భక్తి భావంతో పాటు ఐక్యతను పెంపొందిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు. శ్రీనగర్ కాలనీలో రూ.91,501కు వినాయక లడ్డూ వేలం పలకడం స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కొడి వెంకట్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు, తదితరులు పెద్దయెత్తున పాల్గొన్నారు.









# ములుగు పట్టణ సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు

- మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం
- మంత్రి సీతక్క.
- రూ.15 కోట్ల'తో అథ్లెటిక్ స్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదనలు.

**ప్రజా వాయిస్ ములుగు జిల్లా, సెప్టెంబర్ 23:/** ములుగు పట్టణ సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. ములుగు మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డు లక్ష్మీ నగర్'లో పంచాయతీరాజ్ శాఖ నిధులు రూ.5.95 కోట్లతో నిర్మించిన ఈస్ట్ రోడ్డును జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు'తో కలిసి మంత్రి ప్రారంభించారు.

### ప్రతి వార్డులో మౌలిక వసతుల అభివృద్ధి:

ములుగు పట్టణ విస్తరణకు అనుగుణంగా రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, మురుగునీటి కాలువలు వంటి మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నట్లు సీతక్క తెలిపారు. ప్రతి వార్డులో అవసరమైన అభివృద్ధి పనులకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు.

### యువత'లో క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం:

యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ములుగులో రూ.15 కోట్లతో అథ్లెటిక్ స్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించినట్లు మంత్రి తెలిపారు. కొత్తగా నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం అందుబాటులోకి వచ్చిందని, జిల్లా పోలీసు కార్యాలయ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు.

### పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి:

రామప్ప దేవాలయం పరిసరాల్లో పర్యాటకులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మల్లూరు క్షేత్ర అభివృద్ధికి అవసరమైన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర ప్రతిపాదనలు రూపొందించనున్నట్లు చెప్పారు.

### మేడారం అభివృద్ధికి చర్యలు:

మేడారం సమ్మక్క–సారలమ్మ క్షేత్రంలో భక్తులు, స్థానికులకు మెరుగైన సౌకర్యాల కోసం 30 పడకల ఆసుపత్రి, రహదారులు–భవనాల శాఖ అతిథిగృహం, అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

### రైతుల ధాన్యం నిల్వ సమస్యకు పరిష్కారం.

రైతుల ధాన్యం నిల్వ సమస్య పరిష్కారానికి ప్రతి మండలంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో గోదాములు నిర్మించేందుకు వ్యవసాయ శాఖకు నివేదికలు సమర్పించినట్లు తెలిపారు. ప్రతిపాదనల పరిశీలన అనంతరం అవసరమైన చర్యలు చేపడతామని వెల్లడించారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు. జిల్లా అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, స్థానిక కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పదహారేళ్ల ప్రస్థానం.. మళ్లీ ఉద్యమ బాటేనా.?

- ప్రజల కోసమే పోరాటం.. ప్రభుత్వం, పార్టీ కంటే ప్రజలే ముఖ్యం
- 'నిధులు వచ్చుడో.. లేక నేను సచ్చుడో' అంటూ నాడు ఆమరణ దీక్ష
- ఐదు రోజుల నిరాహార దీక్షతో కదిలిన అధికారులు.. తర్వాత పనులకు శంకుస్థాపనలు
- బయ్యారం పెద్ద చెరువుకు గోదావరి జలాల కోసం మళ్లీ దీక్షకు సిద్ధమేనా




**ప్రజా వాయిస్,బయ్యారం :** పదహారేళ్ల క్రితం బయ్యారం మండలంలో సాగిన ఆమరణ నిరాహార దీక్ష ఉద్యమ చరిత్రలో ఓ కీలక ఘట్టంగా నిలిచింది. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులకు నిధుల మంజూరు కోసం నాడు మధుకర్‌రెడ్డి చేపట్టిన దీక్ష మూడు రోజులు దాటినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఉద్యమం మరింత ఉధృతమైంది. 'నిధులు వచ్చుడో.. లేక నేను సచ్చుడో' అంటూ ఆయన చేసిన నినాదం అప్పట్లో చర్చనీయాంశమైంది. నాటి పత్రికల్లో ప్రచురితమైన కథనాలు, ఫొటోలు ఇప్పుడు ఆ ఉద్యమానికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

### ఆరోగ్యం సహకరించకపోయినా.. పోరాటం ఆగలేదు

దీక్ష సమయంలో మధుకర్‌రెడ్డి ఆరోగ్యం క్షీణించినట్లు వైద్యులు హెచ్చరించినా ఆయన వెనక్కి తగ్గలేదు. వ్యక్తిగత ఆరోగ్యం కంటే ప్రాంత అభివృద్ధికే ప్రాధాన్యం ఇచ్చారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు బయ్యారం మండలంలోని మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలనే డిమాండ్‌తో ఉద్యమాన్ని కొనసాగించారు. దీక్షా శిబిరానికి పలువురు వచ్చి సంఘీభావం ప్రకటించి సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు.

### పార్టీ, ప్రభుత్వం కంటే ప్రజలే ముఖ్యం

నాడు పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమమే ముఖ్యమని భావించి నిరాహార దీక్షకు దిగినట్లు మధుకర్‌రెడ్డి తెలిపారు. ముత్యాలమ్మగూడెం నుంచి బయ్యారం, ఉప్పలపాడు నుంచి నర్సతండా వరకు రాకపోకల సమస్యలు తీవ్రంగా ఉండేవని, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఆయా గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం అప్పట్లో అధికారులతో పోరాడాల్సి వచ్చిందన్నారు.

### ఐదు రోజుల తర్వాత దీక్ష విరమణ

దీక్ష ఐదో రోజుకు చేరుకున్న సమయంలో రాజకీయ గురువు రామిరెడ్డి వెంకటరెడ్డి సూచన మేరకు, అప్పటి జడ్పీ చైర్మన్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో మధుకర్‌రెడ్డి దీక్షను విరమించినట్లు తెలిపారు. అనంతరం తెలంగాణ ఉద్యమం, ఇతర రాజకీయ పరిణామాలతో కొంతకాలం ఈ అంశాలు వెనుకబడినా.. 2014లో కనకయ్య గెలిచిన తర్వాత 2017లో ఆయా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

### ఇప్పుడు ఆ ఫొటో ఎందుకు తెరపైకి వచ్చింది.?

పదహారేళ్ల క్రితం జరిగిన ఆమరణ నిరాహార దీక్షకు సంబంధించిన ఫొటో, వార్తా కథనాలు ఇప్పుడు మరోసారి తెరపైకి రావడం బయ్యారం రాజకీయ, ప్రజా వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. అప్పటి ఉద్యమ స్ఫూర్తిని మరోసారి కొనసాగించేందుకేనా? లేక కేవలం జ్ఞాపకాలను గుర్తు చేసేందుకేనా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాంతీయ సమస్యలపై మళ్లీ ఉద్యమ కార్యాచరణ ఉంటుందా అనే ఆసక్తి నెలకొంది

### గోదావరి జలాల కోసం.. మళ్లీ దీక్ష.?

ప్రస్తుతం బయ్యారం పెద్ద చెరువుకు గోదావరి జలాలను తరలించాలనే డిమాండ్‌పై విస్తృత పోరాటానికి సిద్ధమవుతున్నట్లు నాయకులు చెబుతున్నారు. అవసరమైతే ఈ ప్రాంత ప్రజల కోసం మరోసారి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టేందుకు కూడా సిద్ధమని మధుకర్‌రెడ్డి స్పష్టం చేసినట్లు సమాచారం. మరి పదహారేళ్ల నాటి ఉద్యమ స్ఫూర్తి ఇప్పుడు మళ్లీ కార్యరూపం దాల్చుతుందా బయ్యారం పెద్ద చెరువుకు గోదావరి జలాలు చేరే వరకు పోరాటం సాగుతుందా అన్నది వేచి చూడాల్సిందే.

# దళిత మహిళా సర్పంచ్‌పై ఎమ్మెల్యే దురుసు ప్రవర్తన

- తీర్మానాలు ఇవ్వొద్దని చెప్పా
- నువ్వెవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ బెదిరించారని ఆరోపణ
- సభ సాక్షిగా దూషించారని, సస్పెండ్ .. డిస్మిస్ చేయిస్తానని హెచ్చరించారని ఫిర్యాదు
- సొంత డబ్బులతో గ్రామాభివృద్ధి పనులు.. అప్పులపాలయ్యానంటూ సర్పంచ్ ఆవేదన
- జాజాల వాగు నుంచి అక్రమ ఇసుక రవాణాను ప్రశ్నించినందుకే వేధింపులంటూ ఆరోపణ



**ప్రజా వాయిస్, వంగూరు:**నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం జాజాల గ్రామ దళిత మహిళా సర్పంచ్ జిలకర కాశమ్మ చేసిన ఆరోపణలు జిల్లాలో కలకలం రేపుతున్నాయి. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ తన పట్ల దురుసుగా వ్యవహరించి, సభ సాక్షిగా అవమానించారని ఆమె ఆరోపించారు. తాను బీఆర్ఎస్ పార్టీ తరపున మాదిగ సామాజిక వర్గానికి చెందిన మహిళగా సర్పంచ్‌గా ఎన్నికై తొమ్మిది నెలలు అవుతోందని తెలిపారు.గ్రామంలో అభివృద్ధి పనుల కోసం తన మెడలోని పుస్తెలతాడు, చేతి ఉంగరాలను ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి సొంత డబ్బులతో పనులు చేయించానని కాశమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త మోటార్లు, వీధిలైట్లు తదితర పనులు చేపట్టినట్లు చెప్పారు. వాటికి సంబంధించిన తీర్మానాలు తీసుకుని, ఎంబీ రికార్డు చేయించి తాను ఖర్చు చేసిన మొత్తాన్ని తిరిగి పొందాలని భావించగా.. గ్రామ కార్యదర్శి తీర్మానాలు ఇవ్వడం లేదని ఆరోపించారు.

### అవును.. నేనే ఆపాను అన్నారని ఆరోపణ

తీర్మానాలు ఇవ్వొద్దని ఎమ్మెల్యే వంశీకృష్ణ చెప్పారని కార్యదర్శి తనకు తెలిపినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని సెప్టెంబర్ 22న వంగూరులో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. తానే ఆపానని ఎమ్మెల్యే చెప్పారని ఆమె ఆరోపించారు. సొంత డబ్బులతో గ్రామంలో పనులు చేయించి తాను అప్పులపాలయ్యానని ప్రశ్నించగా, ఎమ్మెల్యే తనను బెదిరిస్తూ మాట్లాడారని వాపోయారు. సభ సాక్షిగా దూషించి అవమానించారని, కలెక్టర్‌కు చెప్పి సస్పెండ్, డిస్మిస్ చేయిస్తానని హెచ్చరించారని ఆరోపించారు.

### ఇసుక రవాణాపై ప్రశ్నించడమే కారణమా..?

జాజాల వాగు నుంచి జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాను ప్రశ్నించడమే వివాదానికి అసలు కారణమని సర్పంచ్ కాశమ్మ ఆరోపించారు. రోజూ వందలాది టిప్పర్లు, లారీలు రాత్రింబవళ్లు ఇసుకను తరలిస్తున్నాయని పేర్కొన్నారు. దీనిని అడ్డుకునేందుకు, ప్రశ్నించేందుకు ప్రయత్నిస్తున్నందుకే తమపై ఒత్తిళ్లు, బెదిరింపులు వస్తున్నాయని ఆరోపించారు. ఎమ్మెల్యే అనుచరుడిగా పేర్కొన్న ఎద్దుల నరేందర్‌రెడ్డి ఇసుక రవాణాకు సహకరిస్తున్నారని ఆమె ఆరోపించారు.

### కలెక్టర్ , ఎస్పీ స్పందించాలి

తాను దళిత మహిళా సర్పంచ్‌గా ఉన్నప్పటికీ తనపట్లే ఇంతటి అవమానకరంగా వ్యవహరిస్తే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని కాశమ్మ ప్రశ్నించారు. తనకు జరిగిన అవమానంపై ప్రజా సంఘాలు స్పందించి న్యాయం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.కాగా, ఈ ఆరోపణలపై ఎమ్మెల్యే వంశీకృష్ణ స్పందన కోసం ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. దీంతో ఈ వ్యవహారం నాగర్‌కర్నూల్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

# చిగురంత ప్రాణం" చికిత్సలో జాప్యమా..?

- శిశువు మృతిపై తల్లిదండ్రుల ఆరోపణలు
- పర్ల్ ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన

**ప్రజా వాయిస్// రాజేంద్రనగర్:**పుట్టిన రెండో రోజే పసికందు మృతి చెందడం రాజేంద్రనగర్‌లో విషాదాన్ని నింపింది. బాపూఘాట్ రోడ్డులోని పర్ల్ ఆస్పత్రిలో జరిగిన ఈ ఘటనపై శిశువు తల్లిదండ్రులు వైద్యుల నిర్లక్ష్యంపై ఆరోపణలు చేయడంతో విషయం చర్చనీయాంశంగా మారింది. కాటేదాన్‌కు చెందిన శాలినికి సోమవారం పర్ల్ ఆస్పత్రిలో మగ శిశువు జన్మించాడు. పుట్టిన రోజు బిడ్డ ఆరోగ్యంగానే ఉన్నప్పటికీ, మరుసటి రోజు కడుపునొప్పితో తీవ్రంగా బాధపడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పరిస్థితి క్షీణిస్తున్నా ఆస్పత్రిలో చిన్నపిల్లల వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో సకాలంలో అవసరమైన చికిత్స అందలేదని తల్లిదండ్రులు ఆరోపించారు.శిశువు పరిస్థితి విషమించడంతో మంగళవారం సాయంత్రం అంకుర ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.అక్కడ చికిత్స పొందుతూ శిశువు మృతి చెందినట్లు పేర్కొన్నారు.సుమారు 17 ఏళ్ల తర్వాత కుటుంబంలో మగ సంతానం కలగడంతో ఆనందంలో ఉన్న తమకు, బిడ్డను కోల్పోవడం తీరని విషాదాన్ని మిగిల్చిందంటూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

### ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన

శిశువు మృతితో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు,బంధువులు పర్ల్ ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు.ఈ సందర్భంగా ఆస్పత్రి అద్దాలు ధ్వంసమైనట్లు సమాచారం.బిడ్డ ఆరోగ్యం క్షీణిస్తున్న సమయంలో సకాలంలో స్పందించి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని వారు ఆరోపించారు. ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




### అసలు కారణమేంటి?

సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు.శిశువు మృతికి వైద్యపరమైన కారణాలేమిటి.? చికిత్సలో జాప్యం జరిగిందా.? ఆస్పత్రిలో చిన్నపిల్లల వైద్యుడు అందుబాటులో ఉన్నారా.? అనే అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.వైద్య రికార్డులు,కుటుంబ సభ్యుల ఫిర్యాదు తదితర ఆధారాలను పరిశీలించి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.వైద్యుల నిర్లక్ష్యం జరిగిందనే ఆరోపణలు నిజమా? లేక శిశువు మృతికి ఇతర వైద్య కారణాలున్నాయా? అనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# గణపతి బప్పా మోరియా.. వచ్చే ఏడు మళ్లీ రా..!

- భక్తి వెల్లువలో గణనాథుడికి ఘన వీడ్కోలు
- తప్పెట్ల మోత.. నామస్మరణల హోరు
- కన్నులపండువగా శోభాయాత్ర.. అంగరంగ వైభవంగా నిమజ్జనం
- కోదాడ పెద్దచెరువులో నిమజ్జనానికి భారీ ఏర్పాట్లు

**ప్రజా వాయిస్,కోదాడ:** వీధి వీధినా.. గల్లీ గల్లీనా.. ఎక్కడ చూసినా 'గణపతి బప్పా మోరియా.. వచ్చే ఏడు మళ్లీ రా' అంటూ నామస్మరణలు మార్మోగాయి. భక్తుల కోలాహలం, తప్పెట్ల మోత, డీజేలు, మేళతాళాల నడుమ గణనాథుల శోభాయాత్రలు అంగరంగ వైభవంగా సాగాయి. భక్తులు ఉత్సాహంగా పాల్గొంటూ గణపయ్యకు ఘనంగా వీడ్కోలు పలికారు. చిన్నారులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది.నవరాత్రుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథులను ప్రత్యేక వాహనాలపై అలంకరించి శోభాయాత్రగా నిమజ్జనానికి తరలించారు. దారిపొడవునా భక్తులు పూలు చల్లుతూ స్వామివారిని దర్శించుకున్నారు. గణేశ్ నామస్మరణలతో పట్టణ వీధులు మార్మోగాయి. యువత ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేయగా.. మహిళలు, పిల్లలు భక్తి పారవశ్యంలో పాల్గొన్నారు.



### భారీగా నిమజ్జన ఏర్పాట్లు

కోదాడ పెద్దచెరువులో గణనాథుల నిమజ్జనం కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. నిమజ్జన ప్రాంతంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ఇతర మౌలిక ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టారు.మున్సిపల్ కమిషనర్ రమాదేవి, చైర్‌పర్సన్ కుసుమ ఏర్నేని వెంకటరత్నం బాబు, ఆర్డీవో సూర్యనారాయణ, ఎమ్మార్వో సంతోష్‌కుమార్, పట్టణ సీఐ శివశంకర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి,రెస్క్యూ టీం అధికారులు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు.

# జనగామ జిల్లా స్థాయి అస్మిత రగ్బీ సిటీ టోర్నమెంట్స్

## చెన్నూరు గ్రామంలో ఉత్సాహంగా రగ్బీ పోటీలు

ప్రజా వాయిస్/పాలకుర్తి/సెప్టెంబర్ 13
పాలకుర్తి మండలం: జనగామ జిల్లా స్థాయి అస్మిత రగ్బీ సిటీ టోర్నమెంట్స్ బుధవారం పాలకుర్తి మండల కేంద్రంలోని చెన్నూరు గ్రామ జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాల క్రీడా మైదానంలో ఘనంగా నిర్వహించారు. 15 సంవత్సరాలు, 18 సంవత్సరాల బాలికల విభాగాల్లో ఈ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జనగామ జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షులు దొంతమల్ల గణేష్ అధ్యక్షతన నిర్వహించారు. బాలికల్లో క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు రగ్బీ క్రీడను మరింత ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి పాలకుర్తి సీఐ భరత్ సుమన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అలాగే తెలంగాణ రాష్ట్ర రగ్బీ డెవలప్మెంట్ ఆఫీసర్ శేషు పాల్గొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు కొండ రవి, ఉపాధ్యక్షులు మామిండ్ల సోమల్లు, ప్రధాన కార్యదర్శి బాలబోయిన సందీప్, చెన్నూరు జెడ్ పి హెచ్ ఎస్ ప్రధానోపాధ్యాయులు పుస్కూరి రమేష్, చెన్నూరు గ్రామ ఉపసర్పంచ్ జంపాల పుష్పలీల అంజయ్య, పాలకుర్తి వైస్ చైర్మన్ కారుపోతుల వేణు, మాజీ ఎంపీటీసీ పుస్కూరి కళింగరావు, మాజీ సర్పంచ్ కారుపోతుల వెంకటయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి కె. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. జనగామ జిల్లా రగ్బీ అసోసియేషన్ తరఫున ఆర్గనైజింగ్ సెక్రెటరీ రావుల కుమారస్వామి, సంయుక్త కార్యదర్శులు జోడు సంతోష్, మాచర్ల సుష్మిత, కోశాధికారి బాలబోయిన నరేష్ పాల్గొన్నారు. అసోసియేషన్ కమిటీ సభ్యులు కొంతం కుమార్, పెంతలా శరత్, ఉలెంగల మాధవి, ఐలపాక గీత, బెల్లంకొండ సాయికుమార్, మొగలగాని నరేష్, జోగు వెంకన్న, నోముల శ్రీకాంత్, చిట్యాల రఘు, అరకల సతీష్, జిట్టబోయిన మహేష్



తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలికలు ఉత్సాహంగా రగ్బీ పోటీల్లో పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. గ్రామీణ ప్రాంతాల బాలికలకు ఇటువంటి పోటీలు నిర్వహించడం ద్వారా క్రీడలపై ఆసక్తి పెరగడంతో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభను చాటుకునే అవకాశాలు లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు.

# మృతి చెందిన కుటుంబానికి మేస్త్రి సంఘం ఆర్థిక సాయం

- ఎర్ర పోచయ్య మృతితో కుటుంబంలో విషాదం
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సంఘం సభ్యులు
- రూ.5 వేల ఆర్థిక సాయం అందజేత
- మేస్త్రి సంఘం అధ్యక్షుడు గూడూరి స్వామి

**ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 8 వార్డు ఆర్అండ్ఆర్ కాలనీ, పల్లెపహాడ్ గ్రామానికి చెందిన మేస్త్రి సంఘం సభ్యుడు ఎర్ర పోచయ్య ఆకస్మికంగా మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న మేస్త్రి సంఘం సభ్యులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి తమ సానుభూతిని తెలిపారు. మేస్త్రి సంఘం తరపున అధ్యక్షుడు గూడూరి స్వామి, ఉపాధ్యక్షుడు శనగరం ఆంజనేయులు ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఆపద సమయంలో సంఘం సభ్యులు కుటుంబానికి అండగా నిలుస్తారని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మేస్త్రి సంఘం అధ్యక్షుడు గూడూరి స్వామి, ఉపాధ్యక్షుడు శనగరం ఆంజనేయులు మాట్లాడుతూ సంఘంలోని ఒక సభ్యుడిని కోల్పోవడం ఎంతో బాధాకరమని తెలిపారు. ఎర్ర పోచయ్య కుటుంబానికి తమ సంఘం తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని పేర్కొన్నారు. కుటుంబానికి అవసరమైన సమయంలో సంఘం సభ్యులు తమవంతు సహకారం అందిస్తారని తెలిపారు. సంఘ సభ్యుల మధ్య ఐక్యతను కొనసాగిస్తూ, సభ్యుల కుటుంబాల్లో ఆపదలు ఎదురైనప్పుడు పరస్పరం అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని వారు తెలిపారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని



ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేస్త్రి సంఘం సభ్యులు మడుగురు కిష్టయ్య, గూడూరి నర్సింలు, పోతుల బాలమల్లు, గూడూరి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ బండకు కొత్త రహదారి

- రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం
- పనులను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజా వాయిస్ సైదాపూర్ :-**
మండల కేంద్రంలోని ప్రసిద్ధ బతుకమ్మ బండ ప్రాంతానికి మహర్దశ పట్టనుంది. ఇక్కడ రహదారి సౌకర్యం లేక స్థానికులు, భక్తులు, సందర్శకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు పరిష్కారం లభించనుంది. వి.బి.జి. రాంజీ నిధుల నుంచి రూ. 20 లక్షలతో మంజూరైన నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సైదాపూర్ గ్రామ సర్పంచ్ మునిగంటి స్వప్న-సంతోష్ దంపతులు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బతుకమ్మ బండ వద్దకు చేరుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్, సర్పంచ్ మునిగంటి స్వప్న-సంతోష్ దంపతులకు గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. బతుకమ్మ బండ ప్రాంతం మండల కేంద్రంలో ప్రముఖ ప్రదేశంగా ఉన్నప్పటికీ సరైన రహదారి సౌకర్యం లేక ప్రజలు చాలాకాలంగా ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు.

**- ఇబ్బందులకు పరిష్కారం**

బతుకమ్మ బండ ప్రాంతంలో రోడ్డు సౌకర్యం కల్పించాలన్న ప్రజల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని రూ. 20 లక్షల నిధులను మంజూరు చేయించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్, సర్పంచ్ దంపతులు తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణంతో వర్షాకాలంలో ఏర్పడే బురద, గుంతల సమస్యలకు పరిష్కారం లభించడంతో పాటు ప్రజల రాకపోకలకు సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. బతుకమ్మ బండకు వచ్చే ప్రజలు, స్థానికులకు రహదారి సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు.

**- నాణ్యతకు ప్రాధాన్యం**

రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు వారు తెలిపారు. పనుల్లో



నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన అనంతరం బతుకమ్మ బండ పరిసర ప్రాంతంలో రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ వార్డు సభ్యులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ ఆదర్శం జర్నలిస్టుల రక్తదాన శిబిరం

**టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షులు యాదగిరిని అభినందించిన జిల్లా కలెక్టర్**
**శాలువాతో సత్కారం**
**ప్రశంసా పత్రం అందజేత**

**పటాన్ చెరువు ప్రజా వాయిస్**
జర్నలిస్టుల రక్తదాన శిబిరం ఆదర్శనీయమని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ వెల్ డన్ యాదగిరి. గుడ్ జాబ్ అని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అభినందించారు. నేనే మీకు శాలువా కప్పాలి అంటూ శాలువాతో సత్కరించారు. రక్తదాన శిబిరానికి సంబంధించిన ప్రశంసా పత్రాన్ని యాదగిరి కి అందజేశారు.

తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (TUWJ- IJU) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి జన్మదిన పురస్కరించుకొని మంగళవారం పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొనాల్సి ఉన్నది. అత్యవసర పనుల వల్ల ఆయన పాల్గొనలేకపోయారు. దీంతో బుధవారం నాడు జర్నలిస్ట్ యూనియన్ నాయకుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో జర్నలిస్టులు కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ను కలిశారు. నోట పుస్తకాలను అందించారు. రక్తదాన శిబిరం ద్వారా సమాజానికి సేవా నిరతి ని చాటి చెప్పడం గ్రేట్

అని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజానికి మంచి మెసేజ్ వెళు తుందని అన్నారు. పుట్టినరోజునాడు కేక్ కటింగ్ తో వేడుకలు జరపకుండా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నిత్యం సమాజంలోని



వార్తలను వెలికి తీస్తున్న జర్నలిస్టుల ద్వారా ఇలాంటి కార్యక్రమాలు జరగడం మరింత శుభ సూచకమని పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరు తమ వంతుగా సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా TUWJ IJU సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ తమ యూనియన్ మొదటి నుంచి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించిందని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఎ కే పైసల్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల హక్కులను సాధించడానికి అనేక పోరాటాలు చేశామని వివరించారు. మన్మందు కూడా తమవంతుగా సామాజిక సేవలో పాల్గొంటామని ఈ సందర్భంగా యాదగిరి పేర్కొన్నారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ( డిపిఆర్ఓ) విజయలక్ష్మి కూడా ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు యాదగిరిని అభినందించారు. రక్తదానం ద్వారా ప్రమాదంలో ఉన్న వారికి మేలు కలుగుతుందన్నారు. సామాజిక బాధ్యతగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచిదన్నారు. జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు ప్రభాకర్, చిన్నా మధ్యతరగతి పత్రికల సంఘం ఉపాధ్యక్షుడు నజీర్,

కోశాధికారి లక్ష్మణ్, రథసారథి సీఈవో సంతోష్ గౌడ్, ఆంధ్రజ్యోతి శ్రీకాంత్, టీయూడబ్ల్యూజేఐజేయు జిల్లా కార్యవర్గ సభ్యులు ఇర్ఫాన్, విజయ రాజు, మహేష్ ,శ్రీకాంత్, సాక్ష్యం శ్రీనివాస్, నవీన్,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.





# రూ.1.31 లక్షలకు గణపయ్య లడ్డూ

## ఏళ్లుగా ఘనంగా గణేష్ ఉత్సవాలు..

## ఐక్యతకు ప్రతీకగా ఉత్సవాల నిర్వహణ.. మాజీ ఎమ్మెల్యే బొల్లం

**ప్రజా వాయిస్, కోదాడ:**
కోదాడలో క్యాన్వాసింగ్ ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 35 ఏళ్లుగా నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాలు ఐక్యతకు ప్రతీకలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. బుధవారం వర్తక సంఘం వీధిలో ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద నిమజ్జనం సందర్భంగా పూజలు, లడ్డూ వేలం నిర్వహించారు. కమిటీ సభ్యుడు గట్ల కోటేశ్వరరావు నిర్వహించిన వేలం పాటలో వ్యాపారి గౌని ఉకలాద్రి రూ. 1,31,116లకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం మల్లయ్య యాదవ్ లడ్డూను ఉకలాద్రి కుటుంబ సభ్యులకు అందజేసి అభినందించారు. గణపయ్య ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం గణనాథుడి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తుల జయజయధ్వానాల మధ్య నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అర్వపల్లి హనుమంతరావు, కార్యదర్శి గడ్డం రాంబాబు, ఉపాధ్యక్షుడు చాప గోవిందరావు, సహాయ కార్యదర్శి ఓరుగంటి శ్రీనివాస్, కోశాధికారి సముద్రాల బద్రీష్, సభ్యులు పర్వతాలు, రఘు, మధు, సురేందర్, బొడ్ల నాగేశ్వరరావు, గట్ల కోటేశ్వరరావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నయీం, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో గణనాథుడి శోభాయాత్ర

## తొమ్మిది రోజుల పూజలకు ఘన ముగింపు

## అన్నదానం.. కోలాటాలతో సందడిగా నిమజ్జన శోభాయాత్ర

**ప్రజా వాయిస్,కోదాడ:**
కోదాడ పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీ 21వ వార్డులో పట్టణ ప్రకృతి వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహానికి తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి రోజు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై గణనాథుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా చివరి రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ఘనంగా అన్నదానం చేశారు. అనంతరం గణనాథుడి విగ్రహంతో కోలాటాలు, భక్తుల నృత్యాల మధ్య శోభాయాత్ర నిర్వహించారు. డప్పుల మోతలు, గణనాథుడి నామస్మరణతో కాలనీ పరిసరాలు సందడిగా మారాయి. భక్తులు ఉత్సాహంగా శోభాయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# ఆయుర్వేదం తొ ఆరోగ్యం

**మోతె సెప్టెంబర్ /ప్రజా వాయిస్**
ఆయుర్వేదం తొ ఆరోగ్యం మన చేతుల్లో ఉంటుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆయుర్వేద వైద్యాధికారి టి వాణి శివ ప్రియ అన్నారు బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రపంచ ఆయుర్వేద దినోత్సవం సందర్బంగా ధన్వంతరి వేడుక లు ఘనంగా నిర్వహించారు అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆయుర్వేదిక దినోత్సవాన్ని పురస్కరించుకొని మూడు రోజులుగా మండలంలోని సిరికొండ గ్రామంలో హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగింది మోతె లొ యోగ డే పై అవగాహన కల్పించారు ధీర్ఘ కాళిక వ్యాధులపై ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించి ప్రకృతి మనకు ప్రసాధించిన ఔషదాలు సకల రోగాలకు నివారణ కు ఉపయోగపడుతాయని చెప్పారు రోగం ఏదైన అందుబాటులో ఉన్న దావఖాను వెళ్ళి వెంటనే వైద్యులని సంప్రదించి త్వరగా రోగ నిర్ధారణ చేసుకొని చికిత్స తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమం లొ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాదికారి భవాని హెల్త్ సూపర్ వైజర్ పద్మ జి యన్ యం సుకన్య ల్యాబ్ టెక్నషన్ వెంకటేశ్వర్లు జి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు



## వికారాబాద్ మహాసభను విజయవంతం చేద్దాం

- టియుడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ సాగర్ పిలుపు
- ఈనెల 27న అల్లం నారాయణ ఆధ్వర్యంలో మహాసభ

**ప్రజావాయిస్/వికారాబాద్:**
జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి జర్నలిస్ట్ ఐక్యంగా ముందుకు రావాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యూజే హెచ్-143) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ సాగర్ పిలుపునిచ్చారు.ఈనెల 27న సీనియర్ జర్నలిస్టు అల్లం నారాయణ ఆధ్వర్యంలో వికారాబాద్ లో జరగబోయే మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.బుధవారం వికారాబాద్ లో మహాసభకు సంబంధించిన గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మారుతీ సాగర్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్క జర్నలిస్ట్ 27న జరిగే మహాసభకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేసి, ఎదురయ్యే సమస్యలను సంఘం దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం టి యు డబ్ల్యూ జే హెచ్-143 నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా,నియోజక వర్గ జర్నలిస్టుల బృందం పాల్గొన్నారు.



## పర్వతగిరి పీఏసీఎస్‌కు కొత్త సారథి!

**చైర్మన్‌గా పిన్నింటి అనిల్‌రావు బాధ్యతల స్వీకరణ..**
**రైతు సంక్షేమమే లక్ష్యమంటూ కీలక ప్రకటన**

**ప్రజా వాయిస్ /పర్వతగిరి, సెప్టెంబర్ 23:**
పర్వతగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)కు కొత్త సారథి వచ్చారు. నూతన చైర్మన్‌గా పిన్నింటి అనిల్‌రావు బుధవారం పాలకమండలి డైరెక్టర్ల సమక్షంలో ఘనంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. దీంతో పర్వతగిరి పీఏసీఎస్‌లో కొత్త పాలనకు శ్రీకారం చుట్టినట్లైంది.బాధ్యతలు చేపట్టిన అనంతరం అనిల్‌రావు మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సహకారంతో పర్వతగిరి పీఏసీఎస్‌ను ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఆదర్శ సహకార సంఘంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.రైతులకు పీఏసీఎస్ సేవలను మరింత చేరువ చేస్తామని, ప్రభుత్వం అందించే రుణాలు, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి రైతుకు చేరేలా కృషి చేస్తామని తెలిపారు. రైతుల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు, తనకు అండగా నిలిచిన నాయకులకు, డైరెక్టర్లకు, రైతులకు అనిల్‌రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నూతన పాలకమండలి డైరెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## మహమ్మద్ అజీమ్ జ్ఞాపకార్థం రోగులకు పండ్ల పంపిణీ

**ప్రజా వాయిస్ కగజ్ నగర్**
కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని ఎల్లాగౌడ్ తోట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు బుధవారం పండ్లు పంపిణీ చేశారు. ఆర్‌టిఐ కార్యకర్త, ఆర్‌ఎంపీ వైద్యుడు మహమ్మద్ అజీమ్ గత ఏడాది ఇదే రోజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.ఆర్‌ఎంపీ, పీఎంపీ కాగజ్‌నగర్ మండల అధ్యక్షుడు తౌటం శ్రీనివాస్, సహ రక్షణ చట్టం-2005 కొమరం భీమ్ జిల్లా అధ్యక్షుడు వంగరి ప్రవీణ్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ జరిగింది. అజీమ్ వైద్యుడిగా ప్రజలకు సేవలందించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండేవారు. ఆర్‌టిఐ కార్యకర్తగా అవినీతికి వ్యతిరేకంగా పోరాడారు. ప్రజాభివృద్ధి, పారదర్శకత, జవాబుదారితనం, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అజీమ్ సోదరుడు, ఆర్‌టిఐ కార్యకర్త మహమ్మద్ అష్రఫ్ చేస్తున్న పోరాటానికి సంఘీభావం ప్రకటించారు.ఈ కార్యక్రమంలో సహ రక్షణ చట్టం 2005 కొమరం భీమ్ జిల్లా ముఖ్య సలహాదారు రాంటెంకి కృష్ణ, సిర్పూర్ నియోజకవర్గ అధ్యక్షుడు మాదాస్ నాగేష్, కాగజ్‌నగర్ మండల అధ్యక్షుడు కడారి శ్రీనివాస్, దుర్గం సంతోష్, గగన్ రాయ్, తాజ్ తదితరులు పాల్గొన్నారు.



## అత్యంత వైభవంగా ప్రారంభమైన గణేష్ నిమజ్జనోత్సవాలు

**ప్రజా వాయిస్, కరీంనగర్ ( సెప్టెంబర్ 23 ):**
కరీంనగర్ నగరంలో వైభవంగా ప్రారంభమైన గణేష్ నిమజ్జనోత్సవాలు. కొత్తపల్లి నిమజ్జన పాయింట్‌ను ప్రారంభించి తొలి విగ్రహానికి పూజలు చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్. కరీంనగర్ నగరంలో గత తొమ్మిది రోజులుగా భక్తుల పూజలు, భజనలు, విశేష అభిషేకాలందుకున్న లంబోదరుడు గంగమ్మ ఒడికి చేరేందుకు సిద్ధమయ్యాడు. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో గణేష్ నిమజ్జన ఉత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రారంభమయ్యాయి. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొత్తపల్లి వద్ద ఏర్పాటు చేసిన నూతన నిమజ్జనం పాయింట్ వద్ద విగ్రహాల నిమజ్జన ప్రక్రియ శోభాయమానంగా మొదలైంది. ఈ కార్యక్రమాన్ని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ లాంఛనంగా ప్రారంభించారు. కొత్తపల్లి పాయింట్‌కు తరలివచ్చిన మొట్ట మొదటి వినాయక విగ్రహానికి మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేసి క్రేన్ సహాయంతో విగ్రహాన్ని నిమజ్జనం చేసి, విగ్నేశ్వరుడికి భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో మేయర్ తో పాటుగా సిబ్బంది, కార్పొరేటర్లు, ప్రజలు పాల్గొన్నారు..




## జాతీయ థాంగ్-టా పోటీలకు ఐపీఎస్ విద్యార్థులు

- శ్రీనగర్ వేదికగా ఈనెల 28 నుంచి జాతీయ పోటీలు
- రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన నలుగురు విద్యార్థులు

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :**
థాంగ్-టా మార్షల్ ఆర్ట్స్‌లో సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి నలుగురు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై పాఠశాల ఖ్యాతిని చాటారు. ఈనెల 28, 29, 30 తేదీల్లో జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు.ఇటీవల హైదరాబాద్‌లో తెలంగాణ థాంగ్-టా మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఐపీఎస్ విద్యార్థులు ప్రతిభ ప్రదర్శించారు. ఏ.అద్వైత్ 56 కిలోలు, ఎం.సంప్రీత్ 46 కిలోలు, కె.మైత్రి వరుణ్ 52 కిలోలు, టి.ధనుష్‌కుమార్ 56 కిలోల విభాగాల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు.జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ అభినందించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు విద్యతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి చేరుకోవడం పాఠశాలకు గర్వకారణమన్నారు. శ్రీనగర్‌లో జరిగే పోటీల్లోనూ అత్యుత్తమ ప్రదర్శనతో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సునీత, మేనేజర్ శివ, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, సతీష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహం పెద్దదైతే కాదు..మట్టి గణపతే ముద్దు

**పర్యావరణహిత సంప్రదాయానికి వెంకట్రావుపేట యువత శ్రీకారం**
**ప్రతి గ్రామం మట్టి గణపతుల గ్రామంగా మారాలి:జీడిపల్లి రాంరెడ్డి**



**ప్రజా వాయిస్**
**దుబ్బాక/తొగుట**
పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాల ఏర్పాటును ప్రోత్సహించాలని బీఆర్ఎస్ తొగుట మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పిలుపునిచ్చారు.మండలంలోని వెంకట్రావుపేట నిమ్మతోటలో యువకులు బెజ్జనమైన నవీన్, గడ్డమీది నవీన్ లు స్వయంగా మట్టితో గణపతి విగ్రహాన్ని తయారు చేసి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గ్రామ సర్పంచ్ బండారు కవిత స్వామి గౌడ్ తో కలిసి రాంరెడ్డి గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని కుర్మ సంఘం వారు కొన్నేళ్లుగా మట్టి గణపతులను ఏర్పాటు చేసుకుంటున్నారని, అదే స్ఫూర్తితో నిమ్మతోట యువకులు 15 రోజుల పాటు శ్రమించి స్వయంగా విగ్రహాన్ని తయారు చేయడం అభినందనీయమన్నారు.ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారయ్యే విగ్రహాల నిమజ్జనం వల్ల జల కాలుష్యం, పర్యావరణానికి నష్టం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. విగ్రహం పెద్దదిగా ఉండటమే గొప్పతనం కాదని, సంప్రదాయాన్ని కాపాడుతూ పర్యావరణహితంగా మట్టి గణపతులను ఏర్పాటు చేయడం ముఖ్యమన్నారు.ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించి తమ గ్రామాలను మట్టి గణపతుల గ్రామాలుగా మార్చేందుకు ముందుకు రావాలని రాంరెడ్డి కోరారు. ఈ సందర్భంగా మట్టి విగ్రహాన్ని స్వయంగా తయారు చేసిన యువకులను అభినందించారు



## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

**పెద్ద మడూర్ లో పలు భాదిత కుటుంబాలకు పరామర్శించిన. ఎర్రబెల్లి దయాకర్ రావు**

**ప్రజా వాయిస్/దేవరుప్పుల/సెప్టెంబర్ 23**
దేవరుప్పుల :-బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు స్పష్టం చేశారు.బుధవారం దేవరుప్పుల మండలంలోని పెద్దమడూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గనుపాక శ్రీనివాస్ పానుగంటి సాయిలు గోడిశాల సుశీల గనుపాక ఐలమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపి ఓదార్చారు.అదేవిధంగా అనారోగ్యంతో హాస్పిటల్ లో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న శ్యామల సుధాకర్ రెడ్డి దుబ్బ రాజశేఖర్ రేగుల స్వామిదాస్ రుద్రోజు యాదగిరి నాగిళ్ళ జాశివలను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి వివరాలు అడిగి త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు..ఎవరు అధైర్య పడద్దని అన్ని విధాలుగా పార్టీ తాను అండగా ఉంటారని మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో వారితో పాటు బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ మాజీ అధ్యక్షుడు బస్వ మల్లేష్ ఏల సోమ సుందర్ చింత రవి నల్ల ఉమేష్ దిగోజు కిషోర్ కుమార్ మండల యూత్ అధ్యక్షుడు బానోత్ నవీన్ నాయక్ గ్రామ సర్పంచ్ పానుగంటి గిరిబాబు గ్రామ అధ్యక్షుడు రాములు గ్రామ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అంగరంగ వైభవంగా "మట్టి గణపయ్య" నిమజ్జన మహోత్సవం..

**ప్రత్యేక పూజలు, హారతులతో ప్రారంభమైన నిమజ్జన కార్యక్రమం**
**విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో పాలకుర్తి నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలి**
**టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్రెడ్డి**

**ప్రజా వాయిస్/పాలకుర్తి/సెప్టెంబర్ 23**
పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి మరియు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని చాటుతూ ప్రతిష్ఠించిన మట్టి గణపయ్య నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గణపయ్యకు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించిన అనంతరం డప్పు వాయిద్యాలు, భజనలు, గణపతి నామస్మరణల మధ్య శోభాయాత్రగా నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని గణపతి బప్పా మోరియా నినాదాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.ఈ సందర్భంగా టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, పర్యావరణ హితమైన మట్టి గణపతుల ప్రతిష్ఠాపన ప్రతి ఒక్కరూ చేపట్టాలని, విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో పాలకుర్తి నియోజకవర్గం సుఖశాంతులు, సుభిక్షాలతో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు, మహిళలు, యువత, కార్యకర్తలు, భక్తులు మరియు పెద్ద సంఖ్యలో నియోజకవర్గ ప్రజలు పాల్గొని నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కోరుకంటి చందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్

- చందర్‌ను సత్కరించిన కేటీఆర్
- కుటుంబ సభ్యులతో కలిసి కేటీఆర్‌కు యాదాద్రి ప్రసాదం అందజేత



**ప్రజా వాయిస్ గోదావరిఖని**
బీఆర్ఎస్ పార్టీ రామగుండం నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కుటుంబ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోరుకంటి చందర్‌ను కేటీఆర్ శాలువాతో ఘనంగా సత్కరించి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. నిరంతరం ప్రజాసేవలో ఉంటూ, రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని, పరిపూర్ణ ఆయురారోగ్యాలతో ప్రజలకు మరింతగా సేవలందించాలని ఆకాంక్షించారు. అంతకుముందు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల అనంతరం తెచ్చిన స్వామివారి పవిత్ర తీర్థప్రసాదాలను కేటీఆర్‌కు చందర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# ఘనంగా పోతారంలో గణేష్ నిమజ్జన వేడుకలు

**రూ.1,23,500లకు లడ్డూ.. రూ.31,200లకు సేపుల వేలం**

**భక్తిశ్రద్ధల నడుమ హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు**

**శామీర్ పేట్ / ప్రజా వాయిస్ :మేడ్చల్ జిల్లా**
మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పోతారం గ్రామంలో హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామంలో ఉత్సాహభరితంగా నిమజ్జన శోభాయాత్ర చేపట్టారు. యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపతి బప్పా మోరియా నినాదాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన గణేష్ లడ్డూ వేలంలో పోతిరెడ్డి శ్రవణ్ కుమార్ రెడ్డి రూ. 1,23,500లకు లడ్డూను దక్కించుకున్నారు. అలాగే సేపుల వేలంలో వంగా మధుసూదన్ రెడ్డి రూ. 31,200లకు సేపులను దక్కించుకున్నారు. వేలం కార్యక్రమంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొనడంతో పోతారం గ్రామంలో సందడి నెలకొంది. హనుమాన్ యూత్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రతి ఏడాది భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని, గ్రామ ప్రజల సహకారంతో కార్యక్రమాలను విజయవంతంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది.



# ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలకు తరలిరండి జయప్రదం చేయండి

**ప్రజా వాయిస్ గూడూరు**
మహబూబాబాద్ జిల్లా గూడూర్ మండల కేంద్రంలోని వివిధగ్రామాలలోవాల్ పోస్టర్స్ ఆవిష్కరణ ఈ నెల 28, 29, 30 తేదీలలో ఖమ్మం నగరంలో జరగనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జాతీయ 4వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ గూడూరు మండల కేంద్రం లో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆఫీసులో మరియు గోవిందపురం, మచ్చర్ల, అప్పరాజుపల్లి, జగ నాయకులగూడెం, గ్రామాలలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు గజ్జి లింగన్న, కొట్టెం అచ్చన్న లు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించేందుకు జాతీయ మహాసభలు కీలక వేదికగా నిలుస్తాయని అన్నారు.రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సెప్టెంబర్ 28న ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు  రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో బీజేపీ మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలను ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో రైతు, కూలీలు తిప్పికొట్టారని అన్నారు. రైతు హక్కుల కోసం పోరాడుతున్న ఏఐకేఎంఎస్ మహాసభలకు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలనీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పెనక భరత్, కొటెం బుజ్జన్న, ఒర్రె వెంకన్న, కాడబోయిన నరసయ్య, జోగ వీరస్వామి, రమేష్, రాజు, వెంకన్న, లక్ష్మయ్య, రామక్క, సుజాత, లక్ష్మి, నర్సక్క  తదితరులు పాల్గొన్నారు.



# సూర్యాపేట జిల్లాలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన

**ప్రజా వాయిస్, హుజూర్ నగర్, సెప్టెంబర్ 23**
సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గం నేరేడుచర్ల మండలంలో నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి రూ. 26.93 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు.వీటిలో నేరేడుచర్ల, దూపాడు డబుల్ రోడ్డు, జానల్‌దిన్నె పంచాయతీ భవనం, నేరేడుచర్ల గ్రంథాలయ భవనం ఉన్నాయి. అనంతరం జరిగిన సభలో ఎల్‌నినో అంశంపై బీఆర్ఎస్ చేస్తున్న దుష్ప్రచారంపై మంత్రి తీవ్రంగా మండిపడ్డారు.రైతుల కష్టాలను రాజకీయ పెట్టుబడిగా మార్చుకునేందుకు ప్రతిపక్షం కుట్ర చేస్తోందని, కరువు వస్తే ఆనందపడేలా బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎల్‌నినో అనేది ప్రపంచవ్యాప్త వాతావరణ పరిణామమని, కాంగ్రెస్ సృష్టించిన పదం కాదని స్పష్టం చేశారు. జూరాల ఆయకట్టు పంటల పరిరక్షణ కోసం కర్ణాటక సీఎం డి.కె.శివకుమార్‌తో మాట్లాడినట్లు, ఖరీఫ్ పంటలను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడతామని హామీ ఇచ్చారు. అలాగే వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## సబ్ కలెక్టర్‌ను సన్మానించిన
# విశ్రాంత ఉద్యోగులు

**ప్రజా వాయిస్ కగజ్ నగర్**
కాగజ్‌నగర్ సబ్ డివిజన్‌కు నూతనంగా వచ్చిన సబ్ కలెక్టర్ హర్ష చౌదరి ఐఏఎస్‌ను రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కాగజ్‌నగర్ యూనిట్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ ప్రాంత అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపి, పూల మొక్కలు అందజేసి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు జయదేవ అబ్రహం, ఎం. శివప్రసాద్ నాయర్, ఫైనాన్స్ సెక్రటరీ అంకయ్య, ఎండి అన్వర్, సిహెచ్ రామయ్య, జిల్లా బాధ్యులు ఎం. సుభాష్, కె. పురుషోత్తం, సిహెచ్ ప్రసాద్, ఎం. రాజేశ్వర్, జాడి కేశవ్, శంకర్ లింగం, ముకుందం, శివరాం తదితరులు పాల్గొన్నారు.





# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

**21 మందికి నియామక ఉత్తర్వులు**

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**
కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జిల్లా ఉపాధి కల్పన శాఖ, కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ సంయుక్తంగా జాబ్ మేళా నిర్వహించాయి. నిరుద్యోగ యువతకు వివిధ కంపెనీల సహకారంతో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి తెలిపారు. కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ సహకారంతో భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగ మేళాలు నిర్వహిస్తామని, డిగ్రీ పూర్తి చేసిన ప్రతి విద్యార్థి ఏదో ఒక రంగంలో స్థిరపడాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి బి. కిరణ్ కుమార్ తెలిపారు.ఉద్యోగాల కోసం 70 మంది అభ్యర్థులు హాజరు కాగా, కేకే సోలార్ ఎంటర్‌ప్రైజెస్ యాజమాన్యం ఇంటర్వ్యూలు నిర్వహించి 21 మందిని ఎంపిక చేసి నియామక ఉత్తర్వులు అందజేసింది.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి. లక్ష్మీనరసింహం, ప్లేస్‌మెంట్ సెల్ ఇన్‌చార్జ్ ఇ. శారద, అకడమిక్ కో-ఆర్డినేటర్ డి. జనార్ధన్, అధ్యాపకుడు ఎం. రాజేశ్వర్ పాల్గొన్నారు.

# పాత చిలుకూరులో ఘనంగా గణనాథుడి శోభాయాత్ర

**ధరణి యువజన సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో వేడుకలు**

**ప్రజా వాయిస్,చిలుకూరు:**
పాత చిలుకూరు రైస్ మిల్ బజార్లో ధరణి యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడి శోభాయాత్రను బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శోభాయాత్రను ప్రారంభించారు.భక్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి జైకొడుతూ ఉత్సాహంగా శోభాయాత్రలో పాల్గొన్నారు. డప్పులు, భక్తిగీతాల నడుమ సాగిన యాత్రతో పాత చిలుకూరు రైస్ మిల్ బజార్ సందడిగా మారింది. యువత భక్తి ఉత్సాహంతో నృత్యాలు చేస్తూ వేడుకను మరింత వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో  అనంతారపు గోవింద చారి  కాసాని రమేష్ బెల్లంకొండ కనకయ్య  రాఘవరావు ఇంద్ర  ధరణి యువజన సంఘం సభ్యులు, స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ఎస్ఐఆర్ నోటిసుల పర్యవేక్షకులతో సమీక్ష సమావేశం

**ఏర్పాటు చేసిన మున్సిపల్ కమిషనర్..**

**అప్పగించిన ఎస్ఐఆర్ పనిని సకాలంలో పూర్తి చేయాలి.**

**మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ ఆదేశాలు జారీ..**

**ప్రజా వాయిస్ జహీరాబాద్:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీ పట్టణ పరిధికి సంబంధించి మున్సిపల్ కమిషనర్ ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్)కు సంబంధించి సెక్షన్ అధిపతులు మరియు పర్యవేక్షకులతో బుధవారం ఒక సమీక్ష సమావేశం నిర్వహించారు.అనంతరం  కమిషనర్ ఎస్ఐఆర్ కు సంబంధిత కార్యకలాపాల పురోగతిని సమీక్షించి, అప్పగించిన పనిని సకాలంలో పూర్తి చేయడానికి సంబంధిత అధికారులందరికీ మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ ఎస్ఐఆర్ సంబంధించి అవసరమైన సూచనలు జారీ చేశారు..






# చామలేడులో గణనాథుడికి ఘన పూజలు

**బొడ్డుపల్లి అనిల్-పావని కుటుంబం ఆధ్వర్యంలో భారీ అన్నదానం**

**మెగా ఆరోగ్య వెల్నెస్ సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ**

**ప్రజా వాయిస్ : గుర్రంపోడు మండలం**
నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం చామలేడు గ్రామంలోని శ్రీశ్రీశ్రీ ఉమామహేశ్వర దేవాలయంలో కొనసాగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పదో రోజు భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు బొడ్డుపల్లి అనిల్--పావని కుటుంబం, మెగా ఆరోగ్య వెల్నెస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కొప్పోజు నాగరాజు పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.అనంతరం భక్తులు, గ్రామ ప్రజలకు పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా బొడ్డుపల్లి అనిల్ మాట్లాడుతూ భక్తులకు అన్నప్రసాదం అందించడం ఎంతో సంతోషంగా ఉందని, భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గ్రామ పెద్దలు, యువకులు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. సేవా కార్యక్రమంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# భక్తిశ్రద్ధలతో సిద్ధి వినాయకుడికి వీడ్కోలు

**దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక పూజలు..**

**ఘనంగా లడ్డూ వేలం పాట**



**ప్రజా వాయిస్ దుబ్బాక,సెప్టెంబరు 23:**
దుబ్బాక ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రిలో నిర్వహించిన శ్రీ సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్చకుల ఆధ్వర్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

**రూ.22,116కు లడ్డూ ప్రసాదం**
పూజల అనంతరం వినాయకుడి లడ్డూ ప్రసాదానికి వేలం పాట నిర్వహించారు. ల్యాబ్ టెక్నీషియన్ ప్రణయ్ రెడ్డి రూ. 22,116కు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. అలాగే సాయి చందన రూ. 4,016కు కలశాన్ని వేలంలో దక్కించుకున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్ చిన్న లడ్డూ వేలం పాటలో పాడి దక్కించుకున్నారు **పాల్గొన్నారు.గంగమ్మ ఒడికి గణనాథుడు**
నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గణనాథుడిని నిమజ్జనానికి తరలించారు. భక్తుల జయజయధ్వానాల మధ్య వినాయకుడు గంగమ్మ ఒడికి బయలుదేరారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో భక్తి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# చిలుకూరులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం

**లబ్ధిదారులకు కార్డులు అందజేసిన సర్పంచ్ కొల్లి పుల్లమ్మ నాగయ్య..**

**ప్రజా వాయిస్,చిలుకూరు:**
చిలుకూరు మండల కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ కొల్లి పుల్లమ్మ నాగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత సులభంగా, పారదర్శకంగా అందే అవకాశం ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కార్డుల పంపిణీ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు ఈ. కార్యక్రమంలో  గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్ సోంధుమియా ఎడవెల్లి పుల్లారావు కోడా వెంకటేశ్వర్లు  రామకృష్ణ కొండలు వెంకటయ్య ప్రజాప్రతినిధులు, అధికారులు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# గోప తండాలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

**మోతె సెప్టెంబర్/ ప్రజా వాయిస్**

మోతె మండల పరిధిలోని గోపతండ గ్రామంలో బుధవారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. గోపతండ గ్రామపంచాయతీకి మొత్తం 661 స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భూక్య బిక్కు నాయక్. డీలర్ సీతారాములు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.అనంతరం సర్పంచ్ బిక్కు నాయక్ మాట్లాడుతూ.. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకులు, ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా అందే అవకాశం ఉంటుందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.కార్డులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, గ్రామపంచాయతీ సర్పంచ్‌కు . డీలర్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, మాలోత్ ఈశ్వరి రవి, గ్రామ శాఖ అధ్యక్షుడు గుగులోత్ శివ, మాజీ ఎంపీటీసీ గుగులోత్ శ్రీరాములు, వార్డ్ నెంబర్లు రాములు, లలిత, గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు పక్కా ఏర్పాట్లు

## జిల్లాలో 170 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

## 1.05 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

**ప్రజా వాయిస్, భూపాలపల్లి**

ఖరీఫ్ 2026-27 సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ నుంచి ఆయన పాల్గొన్నారు.జిల్లాలో 170 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీటిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 123, ఐకేపీ ద్వారా 40, జీసీసీ ఆధ్వర్యంలో 5 కేంద్రాలు ఉంటాయని పేర్కొన్నారు. సుమారు 1,05,400 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న 12 కొనుగోలు కేంద్రాలకు ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించాలని, ధాన్యం నిల్వకు ఫంక్షన్‌హాళ్లు, ప్రైవేటు గోదాములు, సీఏపీ స్థలాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. సుమారు 37.60 లక్షల గోనె సంచులను ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు. టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తేమ కొలిచే యంత్రాలు, ఎలక్ట్రానిక్ కాటాలు తదితర పరికరాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు.నూర్పిడి అనంతరం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. సమావేశంలో వ్యవసాయ అధికారి బాబూరావు, పౌర సరఫరాల అధికారి కిరణ్‌కుమార్, డీఎం రాములు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

**ప్రజా వాయిస్ దౌల్తాబాద్, సెప్టెంబర్ 23:**

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంజేపీ ప్రిన్సిపల్ స్వప్న అన్నారు. సిద్దిపేట జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-17 అథ్లెటిక్స్ పోటీల్లో ఎంజేపీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి 10 పతకాలు సాధించడం అభినందనీయమన్నారు.అథ్లెటిక్స్‌లో నాలుగు స్వర్ణ, మూడు రజత, మూడు కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. విద్యార్థులు విష్ణు, శివకుమార్, శ్రీకాంత్, సంజయ్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఎస్‌జీఎఫ్ అండర్-17 వాలీబాల్ పోటీల్లో విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని అన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు శిక్షణ అందించిన ఫిజికల్ డైరెక్టర్ సాయికృష్ణ, పీఈటీలు బస్వరాజ్, డాంబులను అభినందించారు.

# అయ్యప్ప నగర్‌లో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

- వినాయక మండపం వద్ద ఆటపాటల సందడి
- విద్యార్థులు, యువత నైపుణ్యాలకు ప్రోత్సాహం
- 24 ఏళ్లుగా కొనసాగుతున్న వినాయక ఉత్సవాలు
- కులమతాలకు అతీతంగా ఐక్యతకు ప్రాధాన్యం
- ఆకట్టుకున్న ఫైర్ ఫీట్స్ డ్యాన్స్ ప్రదర్శనలు

**ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :**



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్ప నగర్ కాలనీలో వినాయక ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు సందడిగా నిర్వహించారు. రాజీవ్ పార్క్ రోడ్డు సమీపంలోని వినాయక మండపం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆటపాటలు, కోలాటాలు, భజన కార్యక్రమాలు నిర్వహించగా కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థులు, యువతీ యువకుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారి నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజల మధ్య పరస్పర స్నేహభావాన్ని పెంపొందించడంతోపాటు కాలనీలో ఐక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. అయ్యప్ప నగర్ కాలనీలో గత 24 సంవత్సరాలుగా వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొమ్మిది రోజుల ఉత్సవాల్లో కులమతాల భేదాలు లేకుండా కాలనీవాసులంతా కలిసి మెలిసి ఉండేలా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు, మహిళలను ప్రోత్సహించేలా సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, ఆత్మీయ సమ్మేళనాలు, భజన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమాలకు కాలనీవాసుల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా గజ్వేల్ ప్రాంతానికి చెందిన ఫైర్ ఫీట్స్ డ్యాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో విద్యార్థులు, యువతీ యువకులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులు, యువత తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకునేందుకు ఫైర్ ఫీట్స్ డ్యాన్స్ స్టూడియోలో శిక్షణ పొందాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు, గజ్వేల్ కోర్టు సీనియర్ అడ్వకేట్ గుండుఖాళీ ప్రసాద్, సలహాదారు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వెంకన్నగారి వెంకట నరసింహారెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మోతే వీరారెడ్డి, కార్యదర్శి బండ్ల స్వామి, కోశాధికారి అలివేలు నారాయణరెడ్డి, కార్యవర్గ సభ్యులు వగ్గు మల్లేశం, రేకుల అంజిరెడ్డి, ఎంకన్నగారి గోపాల్‌రెడ్డి, కాలనీవాసులు, మహిళలు, యువత, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ ఎయిర్‌పోర్టుకు శ్రీ జగద్గురు రేణుకాచార్యుల పేరు ప్రతిపాదన

## మామునూరు విమానాశ్రయానికి నామకరణం చేయాలని శివశ్రీ సదానిరంజన్ సిద్ధాంతి విజ్ఞప్తి

**ప్రజా వాయిస్ ఎల్కతుర్తి**

వరంగల్ మామునూరు విమానాశ్రయం రూపుదిద్దుకుంటుండటం సంతోషకరమైన విషయమని హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్భాపూర్ గ్రామానికి చెందిన తెలంగాణ వీరశైవ జంగమ ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, స్వర్ణ నంది పురస్కార గ్రహీత, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందిన శివశ్రీ సదానిరంజన్ సిద్ధాంతి అన్నారు. మామునూరు విమానాశ్రయం అభివృద్ధి ద్వారా వరంగల్ ప్రజల భవిష్యత్తుకు ఉజ్వల బాటలు వేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా శివశ్రీ సదానిరంజన్ సిద్ధాంతి మాట్లాడుతూ మామునూరు విమానాశ్రయం అందుబాటులోకి వస్తే వరంగల్ ప్రాంతానికి విమాన రాకపోకలు పెరిగి ఆర్థిక, పారిశ్రామిక, పర్యాటక, విద్యా రంగాల అభివృద్ధికి మరింత అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వరంగల్‌కు చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన పేరును విమానాశ్రయానికి పెట్టడం ద్వారా ఈ ప్రాంత




వారసత్వాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పే అవకాశం ఉంటుందని అన్నారు.యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకలో వెలసిన శ్రీ జగద్గురు రేణుకాచార్యుల పీఠానికి విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందని ఆయన తెలిపారు. శ్రీ జగద్గురు రేణుకాచార్యుల స్వయంభు పంచాచార్య పీఠం వీరశైవ సంప్రదాయంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందని పేర్కొన్నారు.జగద్గురు రేణుకాచార్యులు దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక సేవలను అందించిన మహనీయులుగా వీరశైవ సంప్రదాయంలో గౌరవింపబడుతున్నారని తెలిపారు. అలాంటి మహనీయుని పేరును అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయానికి పెట్టడం ద్వారా తెలంగాణ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేయవచ్చని అన్నారు.అందువల్ల వరంగల్ మామునూరు విమానాశ్రయానికి లిలి‘శ్రీ జగద్గురు రేణుకాచార్య ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్’లిలిగా పేరు పెట్టాలని తెలంగాణ ప్రభుత్వానికి శివశ్రీ సదానిరంజన్ సిద్ధాంతి ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలించి, కొలనుపాక శ్రీ జగద్గురు రేణుకాచార్యుల పీఠం ప్రాశస్త్యాన్ని గుర్తిస్తూ తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.మామునూరు విమానాశ్రయం అభివృద్ధి పనులు వేగంగా పూర్తిచేసి వరంగల్ ప్రజలకు త్వరితగతిన విమాన ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.విమానాశ్రయానికి శ్రీ జగద్గురు రేణుకాచార్యుల పేరు పెట్టడం ద్వారా వరంగల్ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు.

# మోడీ ఫాసిజానికి ట్రంప్ యుద్ధోన్మాధానికి వ్యతిరేకంగా పోరాడుదాం

## .పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు

**ప్రజా వాయిస్ కొత్తగూడ...**

కొత్తగూడ మండలకేంద్రంలో ప్రగతిశీలప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు), అఖిలభారత ఐక్య రైతు కూలి సంఘం (ఎ.ఐ.పి.కె.ఎమ్.ఎస్) ప్రగతిశీలయువజన సంఘం (పి.వై.ఎల్) ఆధ్వర్యంలో భారత జాతీయోద్యమ వీరుడు షాహిద్ భగత్ సింగ్ 119వ జయంతివారోత్సవాలు (సెప్టెంబర్ 22నుండి28వరకు)పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలతో నివాళి అర్పించిన అనంతరం సభ నిర్వహించడం జరిగింది.ఈకార్యక్రమంలోపి.డి.ఎస్.యురాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, జిల్లా సహాయ కార్యదర్శి అలువాల నరేష్,ఎ.ఐ.పీ.కె.ఎం.ఎస్.జిల్లాఉపాధ్యక్షులు మీసాల పాపన్న, పిన్నింటినారాయణరెడ్డి, పి.వై.ఎల్. జిల్లా నాయకులు రాజు లు పాల్గొనిప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతజాతీయోద్యమ వీరుడు షాహిద్ భగత్ సింగ్ పోరాట స్ఫూర్తి నేటి విద్యార్థి, యువతకు మార్గదర్శకం కావాలని, దేశంలో నరేంద్రమోడీప్రభుత్వం అనుసరిస్తున్న



మతోన్మాదఫాసిజానికి, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న యుద్ధోన్మాద చర్యల కువ్యతిరేకంగాపోరాడాలనిపిలుపునిచ్చారు.80 సంవత్సరాల స్వాతంత్ర్య భారత దేశంలో పేదలందరికీ ఉచితంగానాణ్యమైన సమాన విద్య, వైద్యం,అందించటంలో, ఉద్యోగ,ఉపాధి అవకాశాలుకల్పించాటంలో పాలకవర్గాలు పూర్తిగావిఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న విద్యార్థుల 1200 కోట్ల రూపాయల స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు విడుదల చేయకపోవడంతో ఉన్నత చదువులు అర్ధాంతరంగా మధ్యలోనేవదిలేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారుస్కాలర్షిప్ బకాయిలు అడిగిన ప్రైవేట్ విద్యా సంస్థలపై రాష్ట్ర ప్రభుత్వంబెదిరింపులు,విజిలెన్స్అధికారులచేదాడులకుపాల్పడటం సిగ్గుచేటు అన్నారు.మోడీ ప్రభుత్వంఅనుసరిస్తున్న కుల, మతోన్మాద చర్యలతో దేశ లౌకిక వ్యవస్థ, ప్రజల ఐక్యత ప్రమాదంలో పడిందన్నారు.పాలస్తీనా, క్యూబా ప్రజల న్యాయమైన పోరాటాలకు దేశ ప్రజలంతాసంఘీభావంగా నిలబడాలని,ఇజ్రాయిల్, అమెరికా యుద్ధోన్మాదచర్యలనునిరసించాలని, దేశంలోసామ్రాజ్యవాద పెట్టుబడిదారుల ఆర్థిక దోపిడీకి వత్తాసుపలుకుతున్న కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలకు వ్యతిరేకంగాపోరాడాలనిపిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో పి.డి.ఎస్.యు. కొత్తగూడ మండల నాయకులు ప్రేమ్ కుమార్, డి.అనిల్,జి. అరవింద్, జి. కార్తీక్, మహేష్, రాజేష్, నవీన్, సాయి,విష్ణువర్ధన్, రాజు,కిరణ్, అశోక్, తదితరులుపాల్గొన్నారు.

# లడ్డూ.. రూ.3.21 లక్షలు

## సూర్యాపేటలో రికార్డు ధర పలికిన వినాయకుడి లడ్డూ

## గతేడాదితో పోలిస్తే రూ.లక్ష అదనపు ఆదాయం

## బెలిదే శ్రీనివాస్‌కు దక్కిన లడ్డూ

## ఘనంగా శ్రీ గణేష్ ఉత్సవాల ముగింపు వేడుకలు

**ప్రజా వాయిస్,సూర్యాపేట:**

వినాయకుడి లడ్డూకు సూర్యాపేటలో భారీ డిమాండ్ ఏర్పడింది. శ్రీ వేదాంత భజన మందిరం ఆధ్వర్యంలో గత 75 ఏళ్లుగా పూజలు అందుకుంటున్న గణనాథుడి లడ్డూ వేలంపాటలో ఏకంగా రూ.3.21 లక్షల ధర పలికింది. సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బెలిదే శ్రీనివాస్ ఈ లడ్డూను అత్యధిక ధరకు దక్కించుకున్నారు. గతేడాది ఇదే లడ్డూ రూ.2.21 లక్షలకు వేలం కాగా.. ఈసారి మరో రూ.లక్ష అదనంగా ఆదాయం సమకూరింది.శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని పూల సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మున్సిపల్



చైర్‌పర్సన్ నివేదిత లక్ష్మి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.కాగా, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి స్వయంగా ట్రాక్టర్ నడపడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆయన ట్రాక్టర్ నడుపుతుండగా భక్తులు ఆసక్తిగా తిలకించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పోతు భాస్కర్, జిల్లా నాయకుడు మొరిశెట్టి లక్ష్మాది, వార్డు కౌన్సిలర్ గండూరి రమేష్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్



అన్నపూర్ణ, శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అనంతుల కృపాకర్, రంగరాజు రుక్మారావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టా కిషోర్, జీడి బిక్షం, బైరు వెంకన్న, భజన మందిరం అధ్యక్షుడు రాచర్ల వెంకటేశ్వరరావు, కార్యదర్శి నకరికంటి రాజశేఖర్, అర్చకులు ధరూర్ సింగరాచార్యులు, రాఘవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు పూర్తి స్థాయిలో అందేలా చూడాలి

**గంగారం, గూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన**

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్**

**ప్రజా వాయిస్ గంగారం**

మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ గంగారం,గూడూరు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమలు చేస్తున్న వివిధ కేంద్ర మరియు రాష్ట్ర ఆరోగ్య పథకాల రికార్డులను, అలాగే సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యసాధనపై వైద్యాధికారితో సమీక్ష నిర్వహించి, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే 0-5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా అవసరమైన మందులు, పరీక్షా కిట్లు తదితర వైద్య సామగ్రిని తగినంతగా అందుబాటులో ఉంచుకోవాలని వైద్యాధికారికి సూచించారు.జిల్లాలో జరుగుతున్న వినాయక నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాల ఏర్పాట్లను కూడా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమాల సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వైద్య సిబ్బంది, మందులు మరియు ఇతర అత్యవసర వైద్య సేవలను సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో గంగారం మండలంలోని వైద్యాధికారి డాక్టర్ కిరణ్,



గూడూరు మండలంలోని వైద్యాధికారి డాక్టర్ పవన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ప్రైవేట్ పాఠశాలల గురుపూజోత్సవ వేడుకలు

**200 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం..**

**25 సంవత్సరాలుగా గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించడం అభినందనీయం..**

**నవ సమాజ నిర్దేశకులు గురువులు**

**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరువు ప్రజా వాయిస్**

ఒక దేశ భవిష్యత్తు నిర్మాణం తరగతి గదిలోనే జరుగుతుందని.. ప్రతి విద్యార్థిని భావిభారత పౌరుడుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గత 25 సంవత్సరాలుగా గురుపూజోత్సవం పురస్కరించుకొని నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులను ప్రతి ఏటా సన్మానించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.బుధవారం స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి గారి ఆధ్వర్యంలో పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో పటాన్చెరు నియోజకవర్గస్థాయి ప్రైవేటు పాఠశాలల గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ప్రైవేటు పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 200 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో





ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులని కొనియాడారు. విద్యార్థులకు చదువుతోపాటు నైతిక విలువలు, కుటుంబ బంధాలు, సమాజంలో వస్తున్న మార్పులను తెలియజేస్తూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో అధిక శాతం పేద, మధ్యతరగతి కుటుంబాలు తమ పిల్లలని ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలల ద్వారా పోటీ ఏర్పడుతున్నప్పటికీ ప్రైవేటు పాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాయని అభినందించారు.. ప్రతి రంగంలో పటాన్చెరు నియోజకవర్గానికి వన్నెతెచ్చేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు.. ప్రభుత్వ ప్రైవేటు తేడా లేకుండా గత 24 సంవత్సరాలుగా గురుపూజోత్సవ వేడుకలు నిర్వహిస్తూ ఉపాధ్యాయులను సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.ప్రస్తుత సమాజంలో మొబైల్ వాడకం అత్యంత ప్రమాదకరంగా మారిందని తెలిపారు. టెక్నాలజీని మనిషి ఎదుగుదలకు ఉపయోగించుకుంటే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని.. అదే టెక్నాలజీని దుర్వినియోగం చేస్తే సమాజానికి ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఉపాధ్యాయుడు తన తరగతి గదిలోని ప్రతి విద్యార్థి చదువుతోపాటు మానసిక ప్రవర్తన పై ఎప్పటికప్పుడు గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రైవేట్ పాఠశాలల సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఉపాధ్యాయులు విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# కాటేదాన్‌లో కేటీఆర్‌కు ఘన స్వాగతం

**గులాబీమయంగా మారిన రహదారులు**

**మైలార్దేవ్‌పల్లిలోనూ భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు**

**సీఎం సీఎం నినాదాలతో హోరెత్తిన ప్రాంతం**

**ప్రజా వాయిస్// రాజేంద్రనగర్:**

గణనాథుడి దర్శనానికి వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావుకు రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. కాటేదాన్,మైలార్దేవ్‌పల్లి డివిజన్ల మీదుగా బాలాపూర్ వైపు కేటీఆర్ కాన్వాయ్ సాగిన వేళ, రహదారులు గులాబీ జెండాలతో సందడిగా మారాయి.కేటీఆర్ రాకను ముందుగానే తెలుసుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి సమక్షంలో కేటీఆర్‌కు పూలబొకేలు అందించి, శాలువాలతో సత్కరించారు.కార్యకర్తల అభివాదానికి కేటీఆర్ సైతం చేతులు ఊపుతూ, కరచాలనం చేస్తూ స్పందించారు.

**సీఎం సీఎం,నినాదాలతో హోరెత్తిన కాటేదాన్**

కేటీఆర్‌కు స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలిరావడంతో కాటేదాన్, మైలార్దేవ్‌పల్లి ప్రాంతాల్లో కొద్దిసేపు రాజకీయ సందడి నెలకొంది.కార్యకర్తలు "సీఎం సీఎం"అంటూ నినాదాలు చేయడంతో పరిసరాలు హోరెత్తాయి. కేటీఆర్‌ను చూసేందుకు అభిమానులు,పార్టీ శ్రేణులు ఉత్సాహం చూపించారు.ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ..కేటీఆర్ రాక తమలో మరింత ఉత్సాహాన్ని నింపిందన్నారు.ఇదే ఉత్సాహంతో ముందుకు సాగుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు,అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# బుద్వేల్‌లో త్రిముఖ గణపయ్య వైభవం

**లడ్డూ కోసం హోరాహోరీ పోటీ**

**రూ.70 వేలకు దక్కించుకున్న తొండుపల్లి అనంత కుటుంబం**

**ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన 16 అడుగుల బ్రహ్మ-విష్ణు- శివ రూపాల గణపయ్య**

**ప్రజా వాయిస్// రాజేంద్రనగర్:**సర్కిల్ పరిధిలోని బుద్వేల్ గ్రామంలో టీమ్ మహాదేవ్ సేన ఆధ్వర్యంలో ప్రతిష్టించిన 16 అడుగుల భారీ త్రిముఖ గణపయ్య ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి. బ్రహ్మ,విష్ణు,శివ,త్రిమూర్తుల రూపాలతో రూపొందించిన గణనాథుడు తొమ్మిది రోజుల పాటు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాడు. ప్రత్యేక పూజలు,భక్తి కార్యక్రమాలతో మండపం సందడిగా మారింది.ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలం పాట ఉత్కంఠగా సాగింది. కోరని నరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలో పలువురు భక్తులు ఉత్సాహంగా పాల్గొని లడ్డూను దక్కించుకునేందుకు పోటీపడ్డారు.చివరకు తొండుపల్లి అనంత కుటుంబం రూ.70 వేలకు లడ్డూను సొంతం చేసుకుంది.తొమ్మిది రోజుల ప్రత్యేక పూజలు పూర్తయిన అనంతరం గణపయ్యను భక్తుల జయ జయ ధ్వానాలు,గణపతి నామస్మరణల మధ్య నిమజ్జనం కోసం హుస్సేన్ సాగర్‌కు తరలించారు. దీంతో బుద్వేల్‌లో తొమ్మిది రోజుల పాటు సాగిన గణేశ్ ఉత్సవాలకు భక్తిశ్రద్ధల మధ్య ముగింపు పలికింది.ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన"టీమ్ మహాదేవ్ సేన"సభ్యులను స్థానికులు అభినందించారు.



# భూ రీసర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలి..

**అడిషనల్ కలెక్టర్ వెంకారెడ్డి**

ప్రజా వాయిస్ /అడ్డగూడూరు: భూ రీసర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకా రెడ్డి అన్నారు. బుధవారం అడ్డ గూడూరు మండలంలోని జానకీపురంలో జరుగుతున్న రీ సర్వేను అయన పరిశీలించారు. అయన వెంట తహసీల్దార్ శేషగిరి రావు, రెవెన్యూ అధికారులు, రైతులు తదితరులు పాల్గోన్నారు.

# దోమకొండ ఎక్సైజ్ సీఐగా సర్వేశ్వర్ రావు

**ప్రజా వాయిస్ దోమకొండ, సెప్టెంబర్ 23 :** దోమకొండ ఎక్సైజ్ సర్కిల్ శాఖ సీఐగా సర్వేశ్వర్ రావు విధుల్లో చేరారు. దోమకొండకు బదిలీపై వచ్చిన ఆయనకు పోలీసు శాఖలో 17 ఏళ్ల అనుభవం ఉంది.ఖమ్మం జిల్లాకు చెందిన సర్వేశ్వర్ రావు 2009 బ్యాచ్‌లో ఎస్సైగా విధులు నిర్వహించిన అనంతరం 2014 నుంచి 2024 వరకు ఇన్‌ఫోర్స్‌మెంట్ సీఐగా పనిచేశారు. 2024 నుంచి 2026 ఫిబ్రవరి జగిత్యాల జిల్లాలో ఎస్‌హెచ్‌ఓగా పనిచేశారు.



**యువతకు ఉచిత శిక్షణ**

విధి నిర్వహణతో పాటు యువతకు తనవంతు సహకారం అందిస్తూ సర్వేశ్వర్ రావు పోటీ పరీక్షల కోసం ఉచితంగా కోచింగ్ అందించారు.ఫిజికల్ ట్రైనర్‌గా శిక్షణ ఇస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులను ప్రోత్సహించారు.సర్వేశ్వర్ రావుకు పోలీసు విధులతో పాటు మార్షల్ ఆర్ట్స్, . కరాటేలో బ్లాక్ బెల్ట్‌తో 6వ డాన్ డిగ్రీ అర్హతను సాధించారు.పోలీసు, ఇన్‌ఫోర్స్‌మెంట్, ఎస్‌హెచ్‌ఓగా వివిధ హోదాల్లో పనిచేసినఆయన దోమకొండ ఎక్సైజ్ సీఐగా విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ఎక్సైజ్ శాఖకు చెందిన సమస్యలు ఫిర్యాదులు నేరుగా అందజేయాలని నూతన సీఐ సూచించారు



# జిల్లా ఆసుపత్రిలో విద్యుత్, లిఫ్ట్ సమస్యలు పరిష్కరించాలి

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటల విద్యుత్ సరఫరా, జనరేటర్, లిఫ్ట్ సదుపాయాలను అందుబాటులోకి తేవాలని సీపీఎం నాయకులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. విద్యుత్ అంతరాయంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని, జనరేటర్ పనిచేయకపోవడం, లిఫ్ట్ అందుబాటులో లేకపోవడంతో వృద్ధులు, గర్భిణీలు, అత్యవసర రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. తక్షణమే మరమ్మతులు చేపట్టి మౌలిక సదుపాయాలను పటిష్టం చేయాలని కోరారు.



# ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఏర్పాట్లు: మంత్రి పొన్నం

**- గణేష్ నిమజ్జనాలకు పటిష్ట చర్యలు..**

**ప్రజా వాయిస్, కరీంనగర్( సెప్టెంబర్ 23 ):**

వినాయక నిమజ్జనం సజావుగా సాగేందుకు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రభుత్వపరంగా అన్ని పటిష్టమైన చర్యలు తీసుకున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తెలిపారు. ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో గణేశ్ నిమజ్జనానికి ముందు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తదితరులతో కలిసి పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడారు.రాష్ట్రవ్యాప్తంగా బుధవారం అన్ని జిల్లాల్లో జరుగుతున్న గణేష్ నిమజ్జనాలతో పాటు, ఈనెల 25న హైదరాబాద్‌లో నిర్వహించనున్న నిమజ్జనోత్సవాలకు కూడా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు మంత్రి తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిమజ్జనోత్సవాల నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు.వినాయక మండపాల ఏర్పాటుకు సంబంధించి కూడా ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించిందని, మండపాలకు ఉచిత విద్యుత్ వంటి సౌకర్యాలను కల్పించినట్లు మంత్రి వివరించారు. భక్తులు నిమజ్జనోత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, ఎలాంటి అపశ్రుతులకు తావులేకుండా సహకరించాలని కోరారు.రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని గణనాథుడిని ప్రార్థించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# ఆయుర్వేదంతో ఆరోగ్యమే మహాభాగ్యం

**చిలుకూరు ప్రభుత్వాసుపత్రిలో ధన్వంతరి పూజలు**

**ప్రజా వాయిస్,చిలుకూరు** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో ప్రపంచ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధన్వంతరి స్వామి చిత్రపటానికి కొల్లు పుల్లమ్మ, నాగయ్యలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఆయుర్వేద వైద్య విధానం ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. సంప్రదాయ వైద్య విధానాలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు ఆరోగ్య పరిరక్షణలో ఆయుర్వేదం అందిస్తున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, వైద్య సిబ్బంది ఎడవెల్లి పుల్లారావు షేక్ సొందు మియా అమర గాని కాశయ్య. తదితరులు పాల్గొన్నారు.



# కియా కారులో తిరుగుతూ..ఇళ్లే టార్గెట్

**సిద్దిపేటలో అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్**
**జక్కాపూర్ చోరీ కేసును ఛేదించిన పోలీసులు**
**7 గ్రాముల బంగారం.. 33 తులాల వెండి రికవరీ**
**నేరానికి వినియోగించిన కియా సెల్టోస్, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం**

**ప్రజా వాయిస్,సిద్దిపేట :**
కియా సెల్టోస్ కారులో తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఆటను సిద్దిపేట పోలీసులు కట్టించారు. జక్కాపూర్‌లో జరిగిన ఇంటి దొంగతనం కేసును సాంకేతిక ఆధారాలతో ఛేదించి నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి చోరీ సొత్తుతో పాటు నేరానికి ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు.జక్కాపూర్ గ్రామానికి చెందిన బుచ్చెల్లి అఖిల ఇంటి



తాళాలు పగలగొట్టి బంగారం, వెండి ఆభరణాలు చోరీ చేసిన ఘటనపై చిన్నకోడూరు పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో సిద్దిపేట రూరల్ సీఐ విద్యాసాగర్, చిన్నకోడూరు ఎస్ఐ బి. చంద్ర మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలం పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించడంతో పాటు అనుమానాస్పదంగా సంచరించిన ఎరుపు రంగు కియా సెల్టోస్ (టీజీ 08 ఎచ్ 1688) కదలికలను గుర్తించారు. పెట్రోల్ బంకులు, టోల్ ప్లాజాల వద్ద లభించిన సాంకేతిక సమాచారాన్ని విశ్లేషించి నిందితుల కదలికలను ట్రాక్ చేశారు.

**పాత నేరాల చిట్టా**
పోలీసుల విచారణలో ముఠాలోని ప్రధాన నిందితులకు గతంలోనూ పలు దొంగతనం కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు వెల్లడైంది. మాధగాని సురేష్ (35)పై తెలంగాణలోని పలు పోలీస్‌స్టేషన్లలో 26 కేసులు, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలో ఒక కేసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దాసరి నాగయ్య (46)పై 12 పాత కేసులు నమోదైనట్లు వెల్లడించారు. కట్ల మహేష్ (34) ఇసుక వ్యాపారం చేస్తూ ముఠాకు సహకరిస్తుండగా.. ఉండాడి సురేష్ (38) కూలీగా పనిచేస్తూ దొంగతనాల్లో భాగస్వామిగా ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మరో నిందితుడు కుజా కళ్యాణ్ పరారీలో ఉండగా.. అతని కోసం గాలింపు కొనసాగుతోంది.

**చోరీ సొత్తు మొత్తం రికవరీ**
నిందితుల నుంచి బాధితురాలికి చెందిన 7 గ్రాముల బంగారం, 33 తులాల వెండి ఆభరణాలు పూర్తిగా రికవరీ



చేసినట్లు సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి తెలిపారు. దొంగతనానికి ఉపయోగించిన ఎరుపు రంగు కియా సెల్టోస్ కారు, నాలుగు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.సాంకేతిక ఆధారాలను ఉపయోగించి కేసును వేగంగా ఛేదించిన రూరల్ సీఐ విద్యాసాగర్, చిన్నకోడూరు ఎస్ఐ బి. చంద్ర మోహన్, రాజగోపాలపేట ఎస్ఐ వివేక్‌తో పాటు కానిస్టేబుళ్లు పరశురాం, స్వామి, తిరుపతి, శ్రీనివాస్, బాబు, శ్రీను, సంపత్, రాజులను సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మి పెరుమాళ్ ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. వారికి రివార్డులు ప్రకటించి, ఇదే నిబద్ధతతో పనిచేస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు.

# కోదాడ లో ఘనంగా మేకల అభినవ్ 25వ వర్ధంతి

**కోదాడ ఖ్యాతి ఖండాంతరాలకు తీసుకెళ్ళిన క్రీడా జ్యోతి అభినవ్....**
**తెలంగాణ రాష్ట్ర పెరిక కుల కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు....**

**ప్రజా వాయిస్ , కోదాడ:**
పట్టణానికి చెందిన అంతర్జాతీయ చెస్ క్రీడాకారుడు, ఆసియన్ చెస్ ఛాంపియన్ మేకల అభినవ్ 25వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పెరిక కుల కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఛైర్మన్ ఎర్నేని కుసుమ వెంకట రత్నం బాబు మాట్లాడుతూ చిన్న వయసులోనే చెస్ క్రీడలో అసాధారణ ప్రతిభ కనబరిచి ఆసియా స్థాయిలో ఛాంపియన్‌గా నిలిచిన మేకల అభినవ్ కోదాడ ప్రాంతానికి, తెలంగాణ రాష్ట్రానికి భారతదేశానికి గర్వకారణంగా నిలిచారని అన్నారు. అభినవ్ క్రీడా ప్రతిభ, పట్టుదల, క్రమశిక్షణ నేటి యువతకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. అత్యంత ప్రతిభావంతుడైన అభినవ్ అకాల మరణం క్రీడా రంగానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో చెస్ పోటీల్లో పాల్గొని కోదాడ పేరును ఖండాంతరాలకు పరిచయం చేసిన క్రీడా జ్యోతిగా అభినవ్ చిరస్మరణీయుడని అన్నారు. ఆయన సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకొని యువ క్రీడాకారులు క్రీడా రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.అభినవ్ జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపేందుకు ఆయన వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల వద్ద గల అభినవ్ విగ్రహానికి తల్లిదండ్రులు మేకల వెంకటేశ్వర్లు, అరుణా లతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దొంగరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నాగ మల్లేశ్వరి, మాజీ డిసిసిబి చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, ఎంఈఓ సలీం షరీఫ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ షేక్ బషీర్, నయీమ్, కౌన్సిలర్లు కందుల కోటేశ్వరరావు, తూణం కృష్ణ,గంధం పాండు, తోట శ్రీను, నేహా నాజ్, బొలిశెట్టి కృష్ణయ్య, బొలిశెట్టి నాగేంద్రబాబు, హసనాబాద రాజేష్,బద్దం భద్రారెడ్డి, పంది తిరపయ్య,బాగ్దాద్, భాజాన్, కోటేశ్వరరావు, రామినేని సత్యనారాయణ, వెంకటనారాయణ, పత్తిపాక జనార్ధన్, బాదే రాము, వనం నాగేశ్వరరావు, తిపిరిశెట్టి రాజు, సాదే లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్ వీరబాబు రాములు సుబ్బమ్మ జగన్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.





# ఆయుర్వేదంతో ఆరోగ్య పరిరక్షణ సాధ్యం

**అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా మెగా వైద్య శిబిరం**
**289 మందికి ఉచిత వైద్య పరీక్షలు, ఆరోగ్య సలహాలు**

**ప్రజా వాయిస్, భూపాలపల్లి:**
భారతదేశ ప్రాచీన వైద్య విజ్ఞానమైన ఆయుర్వేదం ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. 11వ అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా బుధవారం భూపాలపల్లిలోని ఇంటిగ్రేటెడ్ ఆయుష్ 50 పడకల ఆసుపత్రిలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు.ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ధన్వంతరి భగవాన్‌కు పూజలు నిర్వహించి, జ్యోతి ప్రజ్వలనతో శిబిరాన్ని ప్రారంభించారు. ఆయుర్వేదం వ్యాధుల చికిత్సతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానం, సమతుల్య ఆహారం, యోగా, ప్రకృతి ఆధారిత వైద్య విధానాల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి దోహదపడుతుందని తెలిపారు. ప్రజలు ఆయుష్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.శిబిరంలో మొత్తం 289 మంది వైద్య సేవలు పొందారు. మధుమేహం, రక్తపోటు, కీళ్ల సమస్యలు, చర్మ వ్యాధులు, అస్తమా, స్త్రీ సంబంధిత సమస్యలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి చికిత్స, ఆరోగ్య సలహాలు అందించారు. ఆయుష్ సేవలను గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు మరింత చేరువ చేస్తామని నోడల్ అధికారి డాక్టర్ కె.రాఘవేందర్‌రావు తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, డీపీఆర్ఓ శ్రీనివాస్, వైద్యులు, డిప్యూటీ నోడల్ అధికారులు, ఫార్మసిస్టులు, యోగా ఇన్‌స్ట్రక్టర్లు, ఆయుష్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఇద్దరు చిన్నారులను కోల్పోయిన కుటుంబానికి మంత్రి సీతక్క పరామర్శ

**బాధిత కుటుంబానికి అండగా ఉంటాం: మంత్రి సీతక్క**

**ప్రజా వాయిస్ ములుగు జిల్లా:/**
ములుగు మండలం కాశీందేవిపేట గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి ఇద్దరు ఆడ పిల్లలు మృతి చెందిన ఘటనలో బాధిత కుటుంబాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క బుధవారం పరామర్శించారు. పొలం వద్ద పనుల్లో ఉన్న సమయంలో ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోవడంతో విషాదంలో ఉన్న అహ్మద్ పాషా కుటుంబ సభ్యులను మంత్రి సీతక్క ఓదార్చారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**కుటుంబానికి అండగా ఉంటాం:**
చిన్నారులను కోల్పోయిన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి సీతక్క, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, ములుగు మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉపాధ్యక్షుడు మర్రి రాజు యాదవ్, ఎర్రబెల్లి మనోజ్ కుమార్, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వాయిస్



# ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరం:వంశీకృష్ణ

**ప్రజా వాయిస్ అచ్చంపేట సెప్టెంబర్ 23**
అచ్చంపేట కేంద్రం క్యాంప్ ఆఫీస్ లో లబ్ధిదారులకు పేదలకు ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసాను అందిస్తూ, వారికి అండగా నిలుస్తుంది..అచ్చంపేట నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పంపిణీ చేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రజా పాలనలో మహిళలకు ఉచిత బస్సు ఇంద్రమ్మ ఇల్లు లబ్ధిదారులకు హార్దిక భరోసా కల్పిస్తూ, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అందిస్తున్నదని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎందరో ఇప్పటికీ అనారోగ్యంగా ఉండి ఆరోగ్యంగా తిరిగి వచ్చారని కుటుంబ కి ఏదో విధంగా ఆసరా అవుతుందనే ఆయన తెలియజేశారు ప్రభుత్వ పథకాలు ప్రతి లబ్ధిదారునికి అందించడమే తన లక్ష్యంగా పనిచేస్తున్నామని విపక్షాలు పనిగట్టుకునే బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విపక్షాలు చేసే కుట్రలను తిప్పికొట్టాలని వంశీకృష్ణ పిలుపునిచ్చారు అనేక కార్యక్రమంలో సహాయాన్ని అందిస్తుంది కావున సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రజలు అధిక సంఖ్యలో కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు!



# ఋణాలు చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలి

**పిఎసిఎస్ చైర్మన్ యాస లక్ష్మారెడ్డి**

**ప్రజా వాయిస్/ఆత్మకూరు(ఎం):**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో వ్యాపారులు, రైతులు తీసుకున్న పంట రుణాలు సకాలంలో చెల్లించి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి సహకరించాలని పిఎసిఎస్ చైర్మన్ యాసలక్ష్మారెడ్డి అన్నారు.బుధవారం సహకార సంఘం కార్యాలయంలో 51వ, సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా చైర్మన్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ లింగరాజు పల్లి గ్రామంలో సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన పెట్రోల్ బంకును నెలరోజుల్లోపు ప్రారంభిస్తామని తెలిపారు.సర్వేపల్లి గ్రామంలో 8000 మెట్రి టన్నుల ధాన్యము నిలువకు గోదాం నిర్మించడానికి 5 కోట్లు మంజూరయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.డైరెక్టర్లు తమ గ్రామాల్లో రుణాలు తీసుకున్న రైతులను చెల్లించే విధంగా కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్, సీఈఓ యాస కిరణ్ రెడ్డి, డైరెక్టర్ లు పోతగాని మల్లేశం గౌడ్, శ్రీరాముల భావనరుషి, హరిబాబు ,భాషబోయిన సత్యనారాయణ,జెట్ట ధనుంజయ, బీసు వెంకటయ్య, బాలయ్య,నర్సింహా, సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి,సర్పంచ్ లు సోలిపురం యల్లా రెడ్డి, అంజయ్య, శ్రీనివాస్,అఖిల పక్ష నాయకులు కందటి అనంత రెడ్డి, దిగోజు నర్సింహా చారి, సిద్దులు గౌడ్, హన్మంత్ గౌడ్, దశరథ రెడ్డి, సత్తి రెడ్డి,లాల్ రెడ్డి ఆత్మకూర్ ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్, దొంతరబోయిన భాస్కర్,ఎండీ యూసుబ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# రోడ్ల విస్తరణ పనులు శరవేగం

**జహీరాబాద్ పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు..**
**భవాని మందిర్ - హనుమాన్ మందిర్ రహదారి 40 ఫీట్ల వెడల్పు..**
**రోడ్ల విస్తరణతో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగింపు..**

**ప్రజా వాయిస్ జహీరాబాద్:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో రోడ్ల విస్తరణ పనులకు మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టారు. భవానీ మందిర్, హనుమాన్ మందిర్ రహదారులను 40 అడుగుల వెడల్పుతో విస్తరించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది జేసీబీల సహాయంతో దుకాణాల ఎదుట మెట్లను తొలగిస్తూ కూల్చివేత పనులు చేయగా, భవనాల యాజమానులు, వ్యాపారస్తులు తామే స్వచ్ఛందంగా ఏదైతే 40 ఫీట్ల వెడల్పు మార్కింగ్ వరకు ఉన్న ఆక్రమణలు స్వయంగా వ్యాపారాస్తులు, భవన యాజమానులు తొలగించు కుంటున్నారు. విస్తరణ కూల్చివేత పనులు శరవేగంగా కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా రోడ్ల విస్తరణతో పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు..

# పుష్ప సినిమాలో ఆ పాత్ర నేను చేయాల్సింది.. కానీ!: శివాజీ




టాలీవుడ్ నటుడు శివాజీ 'తెల్ల కాగితం' సినిమా ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతూ... ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ - సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన దిగ్గజ చిత్రం 'పుష్ప'కు సంబంధించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. 'పుష్ప' చిత్రంలో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న ప్రతి నాయక ఛాయలున్న 'మంగళం శ్రీను' పాత్ర మొదట తనకే రావలసి ఉందని శివాజీ తెలిపారు.ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ... "మంగళం శ్రీను పాత్రకు మొదట సుకుమార్ నన్నే అనుకున్నారు. కానీ ఒక పాత్ర ఎవరికి రాసి ఉంటే చివరికి వాళ్లకే దక్కుతుంది. నాకు రాసి లేని పాత్రను నేనెలా చేయగలను? ఆ పాత్ర సునీల్‌కే రాసి పెట్టి ఉంది, అందుకే ఆయన వద్దకు వెళ్లింది. సునీల్ ఆ పాత్రలో అద్భుతంగా జీవించారు, ఎవరు ఏ పాత్ర చేసినా చివరికి అది వాళ్లకే సరిపోతుంది" అని వ్యాఖ్యానించారు.'తెల్ల కాగితం' విశేషాలను ఆయన పంచుకుంటూ... సినిమాల్లోకి రీ-ఎంట్రీ ఇచ్చే సమయంలో తాను విన్న రెండో కథ ఇదేనని, కథ బాగా నచ్చడంతో ఈ చిత్రాన్ని తానే నిర్మించాలని అనుకున్నట్లు తెలిపారు. అయితే ఈ కథ పలువురు నిర్మాతల చేతులు మారి, చివరకు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ అధినేత దిల్ రాజు, కృష్ణ కొమ్మలపాటి సంయుక్త నిర్మాణంలో తెరకెక్కి తన వద్దకే రావడంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు. రమేశ్ బండ్రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాతో పాటు, గ్రాఫిక్స్ కు ప్రాధాన్యత ఉన్న 'కూర్మావతారం' అనే చిత్రంలోనూ తాను నటిస్తున్నట్లు శివాజీ వెల్లడించారు.

## సంజు శాంసన్ విషయంలో ఆ రాత్రి నిద్రపోలేదు: గౌతమ్ గంభీర్




టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా సంజూ శాంసన్‌ను జట్టు నుంచి తప్పించడం తన రెండేళ్ల కోచింగ్ కెరీర్‌లోనే అత్యంత కఠినమైన నిర్ణయమని, ఆ రాత్రి తాను నిద్ర కూడా పోలేకపోయానని తెలిపాడు. వెస్టిండీస్‌తో సిరీస్ ప్రారంభానికి ముందు జియోస్టార్‌తో మాట్లాడుతూ గౌతీ ఈ వ్యాఖ్యలు చేశాడు.ఈ ఏడాది టీ20 ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచిన సంజూ శాంసన్‌ను, ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్ అనంతరం జట్టు నుంచి తప్పించిన సంగతి తెలిసిందే. అతని స్థానంలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అవకాశం ఇచ్చారు. అయితే, ఆ తర్వాత ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన సిరీస్‌లో తిరిగి జట్టులోకి వచ్చిన సంజూ, వరుసగా అర్ధ శతకాలతో సత్తా చాటాడు.ఈ నిర్ణయంపై గంభీర్ మాట్లాడుతూ.. "నా రెండేళ్ల కోచింగ్ ప్రయాణంలో ఆ ఒక్క రాత్రే నేను నిద్రపోలేకపోయాను. ఈ విషయాన్ని నేను సంజూతోనే చెప్పాను. ఎందుకంటే టీ20 ఫార్మాట్‌లో నా కోచింగ్ కెరీర్‌లో అది అత్యంత కఠినమైన నిర్ణయం. ప్రపంచకప్ హీరో అయిన ఆటగాడిని కేవలం మూడు, నాలుగు మ్యాచ్‌ల తర్వాత పక్కనపెట్టాల్సి వచ్చింది. ఆ సమయంలో వైభవ్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. సిరీస్ గెలవాలంటే మాకు టాపార్డర్‌లో పరుగులు అవసరమయ్యాయి. సంజూతో నేను చాలా నిజాయతీగా మాట్లాడాను. అతను కూడా దాన్ని సానుకూలంగా స్వీకరించాడు" అని వివరించాడు.అదే సమయంలో వైభవ్ వంటి యువ ఆటగాళ్లు తమ అవకాశం కోసం వేచి ఉండాలని గంభీర్ స్పష్టం చేశాడు. "సోషల్ మీడియా లేదా బయటి గోల తుది జట్టును నిర్ణయించదు. డ్రెస్సింగ్ రూమ్‌లో కెప్టెన్, కోచ్ కలిసి.. ఎవరైతే మ్యాచ్ గెలిపిస్తారని భావిస్తామో వారికే అవకాశం ఇస్తాం. రెండు సంవత్సరాలుగా నిలకడగా రాణిస్తున్న ఆటగాళ్లను కొన్ని వైఫల్యాలకే పక్కనపెట్టి, డ్రెస్సింగ్ రూమ్‌లో అభద్రతాభావాన్ని సృష్టించలేం. ప్రజాదరణ పొందే నిర్ణయాలు తీసుకోవడం సులభం, కానీ సరైన నిర్ణయాలు తీసుకోవడమే కష్టం. మేము సరైన నిర్ణయమే తీసుకున్నాం" అని గంభీర్ పేర్కొన్నాడు.ఈ సందర్భంగా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌పై గంభీర్ ప్రశంసలు కురిపించాడు. "కేకేఆర్ కెప్టెన్‌గా శ్రేయస్‌లో నాకు నచ్చిన ప్రధాన లక్షణం అతని నిస్వార్థం. జట్టు ప్రయోజనాల కోసం తన నాలుగో బ్యాటింగ్ స్థానాన్ని కూడా వదులుకోవడానికి సిద్ధపడేవాడు. ఒక కెప్టెన్ ఇలా చేయడం చాలా అరుదు. ఒక మంచి నాయకుడికి ఉండాల్సిన మొట్టమొదటి లక్షణం నిస్వార్థం. అది శ్రేయస్‌లో పుష్కలంగా ఉంది" అని కొనియాడాడు. ఒకటి రెండు ఓటములతో జట్టును అంచనా వేయలేమని, జట్టులో కొనసాగింపు చాలా ముఖ్యమని గంభీర్ స్పష్టం చేశాడు.

## ఆసియా క్రీడల్లో మీరాబాయి చానుకు చారిత్రక రజతం.. భారత్ ఖాతాలో మరో 3 పతకాలు

జపాన్‌లోని ఐచి-నగోయాలో జరుగుతున్న ఆసియా క్రీడలు 2026లో నాలుగో రోజు భారత్‌కు చిరస్మరణీయంగా నిలిచింది. వెయిట్‌లిఫ్టింగ్ సూపర్ స్టార్ మీరాబాయి చాను మహిళల 49 కేజీల విభాగంలో చారిత్రక రజత పతకాన్ని కైవసం చేసుకుంది. ఆసియా క్రీడల్లో ఆమెకు ఇదే తొలి పతకం కావడం విశేషం. ఈ విజయంతో ఆమె కెరీర్‌లో మరో మైలురాయిని అందుకుంది.ఇదే రోజు మరో చారిత్రక విజయం కూడా నమోదైంది. సాఫ్ట్ టెన్నిస్‌లో జై మీనా కాంస్య పతకం సాధించి, ఈ క్రీడలో భారత్‌కు తొలి పతకాన్ని అందించాడు. సెమీఫైనల్ మ్యాచ్‌లో గాయపడటంతో అతను పోరాటాన్ని కొనసాగించలేకపోయినా, కాంస్యంతో దేశానికి గర్వకారణంగా నిలిచాడు.షూటింగ్ రేంజ్‌లోనూ భారత్ పతకాల వేట కొనసాగించింది. పురుషుల స్కీట్ టీమ్ (అనంత్‌జీత్ సింగ్ నరుకా, మైరాజ్ ఖాన్, భవ్‌తేఘ్ సింగ్ గిల్) కాంస్య పతకాన్ని గెలుచుకుంది. అంతకుముందు మహిళల స్కీట్ జట్టు కూడా ఇదే విభాగంలో కాంస్యం సాధించింది. అయితే, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్‌లో డబుల్ ఒలింపిక్ పతక విజేత మను భాకర్‌కు నిరాశ ఎదురైంది. ఆమె పతకం లేకుండానే వెనుదిరిగింది.ప్రస్తుతం భారత్ ఒక స్వర్ణం, ఐదు రజతాలు, ఐదు కాంస్యాలతో కలిపి మొత్తం 11 పతకాలతో పట్టికలో 11వ స్థానంలో కొనసాగుతోంది.




# SPORTS

## వాళ్లిద్దరూ ప్రపంచ కప్ గెలవాలని దేశం మొత్తం కోరుకుంటోంది: రింకూ సింగ్




విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ 2027 వన్డే ప్రపంచకప్‌లో భారత్ తరఫున ఆడాలని దేశం మొత్తం కోరుకుంటోందని టీమిండియా బ్యాటర్ రింకూ సింగ్ అన్నాడు. ఇద్దరూ దిగ్గజ ఆటగాళ్లని పేర్కొన్న అతడు.. 2027 ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలిస్తే అది దేశానికే కాకుండా కోహ్లీ, రోహిత్‌కు కూడా ఎంతో ప్రత్యేకమైన సందర్భమవుతుందని చెప్పాడు."విరాట్ భయ్యా, రోహిత్ భయ్యా ఇద్దరూ లెజెండ్స్. వాళ్లు ప్రపంచకప్‌లో ఆడాలని నా ఒక్కడి కోరిక కాదు.. దేశం మొత్తం కోరుకుంటోంది. వాళ్లు జట్టులో ఉండి భారత్‌ను ప్రపంచకప్ విజేతగా నిలిపితే ఎంతో గొప్పగా ఉంటుంది. అది వాళ్లకు చివరి ప్రపంచకప్ కావచ్చేమో. 2011 తర్వాత భారత్ వన్డే ప్రపంచకప్ గెలవలేదు. అందుకే వాళ్లిద్దరూ జట్టుతో ఉండి ట్రోఫీ గెలిస్తే ఎంతో ప్రత్యేకం" అని జియోస్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రింకూ చెప్పాడు.ఐపీఎల్ 2023లో గుజరాత్ టైటాన్స్‌పై వరుసగా ఐదు సిక్సర్లు బాదడంతో రింకూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు. అయితే తనను కేవలం ఆ ఐదు సిక్సర్లతోనే గుర్తించకూడదని అతడు అంటున్నాడు. భారత్ తరఫున ప్రపంచకప్ గెలవడంలో భాగస్వామి కావడమే ప్రస్తుతం తన ప్రధాన లక్ష్యమని చెప్పాడు. బ్యాటింగ్‌తో జట్టుకు ఉపయోగపడుతూ మరిన్ని ప్రపంచకప్ విజయాల్లో భాగం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు.ఇక తాను కేవలం టీ20 ఆటగాడిననే అభిప్రాయాన్ని కూడా రింకూ ఖండించాడు. దేశవాళీ క్రికెట్‌లో వన్డేలు, నాలుగు రోజుల మ్యాచుల్లోనూ ఆడుతున్నానని చెప్పాడు. భారత్ తరఫున టెస్టుల్లో అరంగేట్రం చేయాలన్నది తన కల అని వెల్లడించాడు. ప్రస్తుతం భారత్ తరఫున ఒక్క ఫార్మాట్‌లోనే ఆడుతున్నా.. మూడు ఫార్మాట్లలోనూ రాణించగలనని విశ్వాసం వ్యక్తం చేశాడు.కెప్టెన్సీపై కూడా రింకూ స్పందించాడు. యూపీ లీగ్‌లో తన జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి టైటిల్ గెలిచానని గుర్తుచేశాడు. గత సీజన్‌లో ఐపీఎల్‌లో వైస్ కెప్టెన్‌గా ఉన్నానని చెప్పాడు. అజింక్య రహానే, సూర్యకుమార్ యాదవ్ వంటి ఆటగాళ్ల నుంచి నాయకత్వ లక్షణాలు నేర్చుకుంటున్నానని తెలిపాడు. కెప్టెన్సీలో ఇంకా ఎదగాల్సి ఉందని పేర్కొన్నాడు